RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 99 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | మంగళవారం,అక్టోబర్,7, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 99 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Tuesday,October,7, 2025 | PAGES : 8 RS : 4 /- |



అమెరికాలో భారతీయుడిపై

## కాల్పులు

**- అమెరికాలోని పిట్స్‌బర్గ్‌లో భారత సంతతికి చెందిన వ్యక్తి దారుణ హత్య**

**- మోటెల్ యజమాని రాకేష్ ఏహాగబన్‌ను కాల్చి చంపిన దుండగుడు**

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** అమెరికాలో మరో భారత సంతతి వ్యక్తి దారుణ హత్యకు గురయ్యారు. పెన్సిల్వేనియా రాష్ట్రంలోని పిట్స్‌బర్గ్‌లో గొడవను ఆపేందుకు ప్రయత్నించిన మోటెల్ యజమానిని ఓ దుండగుడు అతి సమీపం నుంచి కాల్చి చంపాడు. ఈ ఘటన గత శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. రాబిన్సన్ టౌన్‌షిప్‌లోని 'పిట్స్‌బర్గ్ మోటెల్' మేనేజర్‌గా పనిచేస్తున్న రాకేష్ ఏహాగబన్ (51) తన మోటెల్ బయట గొడవ జరుగుతుండటంతో పరిస్థితిని తెలుసుకునేందుకు అక్కడికి వెళ్లారు.




సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి

## ఊరట

**బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిటిషన్ కొట్టివేత**

**- హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా విచారించలేం**

**- సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ**

న్యూఢిల్లీ, : సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట లభించింది. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ దవే, అభిషేక్ సింఘ్వి, ఏడీఎన్ రావు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎందుకు ఫైల్ చేశారని పిటిషనర్ తరపు న్యాయవాదిని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టు స్టే ఇవ్వనందున సుప్రీంకోర్టుకు వచ్చామని పిటిషనర్ పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కొట్టివేసిందివసంది. దీంతో బీసీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి బిగ్ రిలీఫ్ లభించింది. అంతేగాకుండా బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ని విచారించడానికి నిరాకరించింది సుప్రీంకోర్టు.



సుప్రీం కోర్టు తీర్పు

## శుభ పరిణామం

**42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం**

**ఢిల్లీలో మీడియాతో మంత్రులు భట్టి, పొన్నం**

న్యూఢిల్లీ, :సుప్రీం కోర్టు తీర్పు శుభ పరిణామం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. 42శాతం బీసీ రిజర్వే షన్లు ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును న్యాయస్థానం కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నాం.. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తాం.. ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసింది.. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించాం.. 42 శాతం రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరితో ఉన్నాం.. ఈ రిజర్వేషన్ల కోసం జీవో కూడా విడుదల చేశాం.. మా నిర్ణయానికి మేము కట్టుబడి ఉన్నామని తెలిపారు.




సుప్రీం తీర్పుతో కాంగ్రెస్

## తొలి విజయం

**జనగామ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి**

**జనగామ, తెలంగాణ దిశ :** బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేయడాన్ని జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి స్వాగతించారు. ఇది స్థానిక ఎన్నికల్లో రేవంత్ సర్కార్ సాధించిన తొలి విజయమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలు అయిన పిటీషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. సోమవారం విచారణలో భాగంగా పిటిషన్ ను కొట్టివేసింది న్యాయస్థానం. ఈ కేసు హైకోర్టులో విచారణ జరుగుతుందని.. అక్కడే తేల్చుకోవాలని స్పష్టం చేసింది సుప్రీంకోర్టు.




మోగిన బీహార్ ఎన్నికల

## నగారా

- రెండు విడుతల్లో ఎన్నికల నిర్వహణ
- నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు
- నవంబర్ 14న కౌంటింగ్..అదేరోజు ఫలితాలు
- 90 వేల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు
- ఈవీఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు
- ఓటు వేయనున్న 7.43 కోట్ల మంది ఓటర్లు
- అందులో 3.92 కోట్ల పురుషులు, 3.50 కోట్ల మహిళా ఓటర్లు
- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, : బిహార్ శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. రెండు విడతల్లో పోలింగ్ నిర్వహి స్తారు. నవంబర్ 6, నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్ట నున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఈ మేరకు షెడ్యూల్ ఖరారు చేసింది. పోలింగ్ తేదీలు, ఇతర వివరాలను కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ సోమవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిం చారు. బిహార్ లో మొత్తం 243 శాసనసభ స్థానాలున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ గడువు వచ్చే నెల చివరి వారంతో ముగియనుంది. బిహార్ లో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ పై జ్ఞానేశ్ కుమార్ స్పందించారు ఎస్ఐఆర్ ముసాయిదాను ఆగస్టు ఒకటిన విడుదల చేశాం. దానిని అన్ని రాజకీయ పార్టీలకు అందజేశాం. అభ్యంతరాలు ఉంటే వ్యక్తం చేసే అవకాశం ఇచ్చాం. తుది జాబితాను సెప్టెంబర్ 30న ప్రకటించాం. ఇప్పటికీ అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తాం అని తెలిపారు. ఈ ఎన్నికలను ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తామని జ్ఞానేశ్ చెప్పారు.



ఆర్టీఐ కొత్త లోగోను ఆవిష్కరించిన

## సీఎం రేవంత్ రెడ్డి

**- సీఎం రేవంత్ రెడ్డితో ఆర్టీఐ కమిషన్ బృందం భేటీ**

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు (ఆర్టీఐ) కమిషన్‌కు కొత్త లోగో వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఈ నూతన లోగోను ఆవిష్కరించారు. 20వ జాతీయ ఆర్టీఐ వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషన్ బృందం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది.

ఈ కార్యక్రమానికి ఆర్టీఐ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలోని బృందం హాజరైంది. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. సీఎంను కలిసిన వారిలో కొత్తగా నియమితులైన కమిషనర్లు బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాసరావు, మొహిసినా పర్వీన్, దేశాల భూపాల్, మెర్ల వైష్ణవి ఉన్నారు.




జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై

## బిజెపి కసరత్తు

**నేడు అభ్యర్థిని ఖరారు చేసేందుకు నేతల భేటీ**

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** భాజపా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ మంగళవారం సమావేశం కానుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని ఈ సమావేశం లో ఖరారు చేయనున్నట్లు తెలుస్తోం ది. ఇప్పటికే నియోజవర్గం నుంచి సమాచారం సేకరించారు. ముగ్గురు పేర్లతో కూడిన జాబితాను అధిష్ఠానానికి పంపించనుంది. బుధవారం అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రేసులో జూటూరు కీర్తిరెడ్డి, వీర పనేని పద్మ, లంకల దీపక్ రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేసి మూడో స్థానానికే పరిమితమయ్యారు. ప్రస్తు తం భాజపా సెంట్రల్ జిల్లా అధ్యక్షు డిగా కొనసాగుతున్న ఆయనకు ఉప ఎన్నిక టికెట్ దక్కుతుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆయ నకు టికెట్ ఇవ్వని పక్షంలో జూటూ రు కీర్తి రెడ్డికి టికెట్ దక్కే అవకాశము ందని సమాచారం. కేంద్రమంత్రి కిష న్ రెడ్డికి సన్నిహితంగా ఉన్న లంకల దీపక్ రెడ్డి, జూటూరు కీర్తిరెడ్డిలో ఒకరు జూబ్లీహిల్స్ ఉపపోరులో నిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరో వైపు గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓవైసీ పై పోటీ చేసి ఓడిపోయిన మాధవి కూడా రేసులో ఉన్నట్లు వార్తలు వచ్చా యి. ఇకపోతే అభ్యర్థి ఎంపికతో పాటు, గెలిపించుకోవడం బిజెపికి ముఖ్యంగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రాంచంద్ర రావుకు సవాల్‌గా మారనుంది. త్రీమెన్ కమిటీ తీసుకునే నిర్ణయం ఆధారంగా ఎంపిక జరగనుంది.




ఉత్తర తెలంగాణను ముంచెత్తిన

## వానలు..

**- కుండపోత వర్షాలతో దెబ్బతిన్న పంటలు..**


**- పలు ప్రాంతాలు అల్లకల్లోలం**



**ఆదిలాబాద్, తెలంగాణ దిశ :** నైరుతు రుతు పవనాల కాలం ముగిసింది.. ఇక వర్షాలు తగ్గుతాయి అనుకునేలోపే తెలంగాణలో మళ్లీ భారీ వర్షాలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం (అక్టోబర్ 05) రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తుండటంతో జనజీవనం స్తంభించిపోయింది. ఉమ్మడి ఆదిలాబాదు జిల్లాలో కుండపోత వానలు కురుస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ లో 3.7సెంటీమీటర్ల వర్షపాతం నమో దైంది. నిర్మల్ జిల్లా ముజ్గిలో 2.2సె.మీ నమోదవ గా.. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ లో 2.0సెమీ వర్షపాతం నమోదైంది. మరోవైపు కొమురం భీం జిల్లా కాగజ్ నగర్ మండలంలో కురుస్తున్న వర్షానికి పంటలన్నీ దెబ్బతింటున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

## - బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి





**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 06, (తెలంగాణ దిశ) :**స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ యంత్రాంగం సన్నద్ధం కావాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. సోమవారంత్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భువనగిరి నియోజకవర్గం పరిధిలోని బీబీనగర్, పోచంపల్లి మండలాల సమావేశం మండల కేంద్రంలోని ఫేమస్ ఫంక్షన్ హాల్ లో బాలాజీ ఫంక్షన్ హాల్ లో బిఆర్ఎస్ పార్టీ మండల, గ్రామ ముఖ్య నాయకుల తో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చింతల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పని చేయాలని కోరారు. గ్రామ స్థాయి నుండి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకం కావాలని నాయకులకు సూచించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలోభరోసా కార్డు ప్రజలకు ఇస్తే కాంగ్రెస్ పాలనలో బాకీ కార్డు ఇచ్చింది. తెలంగాణలో యువత, విద్యార్థులు, రైతులు, మహిళలు, కార్మికులు అన్ని వర్గాలను కాంగ్రెస్ బాకీ కార్డుతో మోసం చేసిందన్నారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు బాకీ, విద్యార్థినులకు స్కూటీ బాకీ, విద్యా భరోసా కార్డు కింద 5 లక్షలు బాకీ,జాబ్ క్యాలెండర్ బాకీ ఉందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికి కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బిఆర్ఎస్ పార్టీ నిర్ణయం తీసుకుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు సమష్టిగా పనిచేసి, బిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డి, బీబీనగర్ మాజీ ఎంపీపీలు,మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండలం బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ వివిధ గ్రామ శాఖల నాయకులు పాల్గొన్నారు.

# త్రిపుర ల్యాండ్ మార్క్ 2 లో నాలా కన్వర్షన్ పనులకు శంకుస్థాపన





**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 06, (తెలంగాణ దిశ) :**
కాలనీ నుంచి పైపు లైన్ ద్వారా వరద నీటిని మళ్లించే నాలా కన్వర్షన్ పనులకు సోమవారం కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హనుమంత్ రెడ్డి, టిపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి శంకుస్థాపన చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేట్ త్రిపుర ల్యాండ్ మార్క్ 2 లో ఎన్నో సంవత్సరాలుగా కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్న ప్రధాన సమస్య వర్షాకాలంలో వరద నీటితో నివాస గృహాలు నీట మునుగుతున్నాయన్నారు.
ఈ సమస్యను స్థానిక కాలనీవాసులు కాంగ్రెస్ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.
దీంతో వారు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి దానికి పరిష్కార మార్గంగా పైపు లైన్ నిర్మించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి, భౌరంపేట్ మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్, బహదూర్ పల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ నాయకులు ముత్యం రెడ్డి, జక్కుల మల్లేష్, ఆర్కల విజయ్ గౌడ్, రాష్ట్ర ఒబిసి జాయింట్ కోఆర్డినేటర్ గడ్డమీద భరత్ గౌడ్, దుండిగల్ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మరి బస్తీ వార్డు కార్యాలయం వద్ద వరద నీటి కాలువ పనులు ప్రారంభం

## - 12 లక్షలు 50 వేల వ్యయంతో స్ట్రామ్ వాటర్ పైప్ లైన్ నిర్మాణం



**కుషాయిగూడ, అక్టోబర్ 06, (తెలంగాణ దిశ) :**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారి చొరవతో మంజూరు అయిన 12 లక్షల 50 వేల తో వరదనీటి పైప్ లైన్ నిర్మాణం పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు నెలల క్రితం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కుషాయిగూడ వార్డు కార్యాలయం కుమ్మరి బస్తీని సందర్శించిన క్రమంలో వరద నీటి కాలువ నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడం మూలంగా నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కుటుంబాలు విన్నవించుకున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పనగట్ల చక్రపాణి గౌడ్, యాదయ్య, చల్లా వెంకటేష్, నల్ల చెరువుల జనార్ధన్, కిషోర్, సాయికిరణ్, నరసింహులు, నందు, పిట్ల రాజు, సాయినాథ్, చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, సారా అనిల్ ముదిరాజ్, మొగిలి రాఘవరెడ్డి, జై కృష్ణ, శ్రీశైలం, దాసరి కనకయ్య, సంపత్, శేఖర్ నాయక్, వెంకటేష్, సాయిబాబా, ప్రసాద్ రెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# కీసరలో బోనాల సందర్భంగా ఏర్పాట్లు

## - మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి





**కీసర, అక్టోబర్ 06, (తెలంగాణ దిశ) :**కీసరలో బోనాల పండుగ సందర్భంగా తొమ్మిది గ్రామ దేవతల ఆలయాల ప్రాంగణంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి సూచించారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో కీసరలో బోనాల పండుగ సందర్భంగా ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలనాయకులు, గ్రామ పెద్దల తో కీసర గ్రామంలో ఉన్న గ్రామ దేవతల దేవాలయాల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణ, విధి దీపాల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కీసరకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చక్రిపురం కాలనీలో రూ. 30 లక్షలతో నూతన డ్రైనేజీ పనులు ప్రారంభం

**చర్లపల్లి, అక్టోబర్ 06, (తెలంగాణ దిశ) :**
చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రిపురం లో గతంలో డ్రైనేజ్ సమస్యపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి మంజూరు చేయించారు. సోమవారం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, టిఆర్ఎస్ నాయకుడు మొగలి రావు రెడ్డి కాలనీ అధ్యక్షుడు గడ్డల పాండు ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి సోమ స్వామి అశోక్, కాలనీ సహదేవ గౌడ్, వినోద్ నాయి, శ్రీనివాస్, వెంకటేష్, తదితరులు పాల్గొని పనులను పరిశీలించారు.



# ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం ఓట్ చోరీని అడ్డుకుందాం..!

## - టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్







**శేరిలింగంపల్లి, అక్టోబర్ 06, (తెలంగాణ దిశ) :**టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజాస్వామ్య పరిరక్షణకు నిదర్శనంగా దేశవ్యాప్తంగా 'వోట్ చోరీ వ్యతిరేక కార్యక్రమం' కాంగ్రెస్ పార్టీ ఘనంగా నిర్వహిస్తోందని అన్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని, ప్రతి ఓటు పవిత్రమైనదని ఆయన అన్నారు. ప్రజల హక్కులను హరించే ఓటు చోరీ వంటి చర్యలను అరికట్టాలని జగదీశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడాలంటే ఓటు హక్కు కాపాడబడాలని, ప్రతి పౌరుడు తన ఓటును స్వేచ్ఛగా వినియోగించే హక్కు కలిగి ఉన్నాడని, ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ర్యాలీలు, చర్చా వేదికలు, బహిరంగ సభల ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రజల ఓటు విలువను మోసం చేసే ఏ చర్యలకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళా నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమం



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 06, తెలంగాణ దిశ ) :**బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమం చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం సోమవారం బిఆర్ఎస్ మేడ్చల్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆధ్వర్యంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నయవంచక హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బాకీకార్డు ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణరావు, కేపీ. వివేకానంద గౌడ్, బండారి లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, మాల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి లతో పాటు జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుత ాకాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలతో ప్రజలను పూర్తిగా మోసం చేసిందని అన్నారు. ప్రజల పట్ల ఈ కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని, వంచనను బయట పెట్టడానికి బిఆర్ఎస్ పార్టీ "బాకీ కార్డు" రూపంలో ప్రజల్లోకి వస్తోందని పేర్కొన్నారు.

# ఎల్ జి విస్టాస్ లో బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 06(తెలంగాణ దిశ) :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ జి విస్టాస్ లో బిటి రోడ్డు పనులకు కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంతరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఎల్ జి విస్టాస్ లో రోడ్ పూర్తిగా పాడువ్వటంతో కాలనీ వాసులు హన్మంత్ రెడ్డిని కలసి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో ఆయన స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక నిధుల ద్వారా రోడ్డు కోసంరూ. 40లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డిని కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, మాజీ కౌన్సిలర్ శివ కుమార్ గౌడ్, జిల్లా లేబర్ సెల్ ప్రెసిడెంట్ సుదర్శన్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు కావాలి గోపాల్ ముదిరాజ్, ఎక్స్ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, జైబెరి గోపాల్ రెడ్డి, అంజి ముదిరాజ్,నాగరాజు యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి కాలనీ అధ్యక్షులు అధ్యక్షులు భాగ్యరెడ్డి, రాజేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, సంతోష్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధపు హామీలు, మోసపూరిత వాగ్దానాలకు నిదర్శనమే ఈ బాకీ కార్డు




**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 06, (తెలంగాణ దిశ) :**మోసపూరిత వాగ్దానాల తో ప్రజలను నయవంచనకు గురిచేస్తూ గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ప్రజల్లో అవగాహన కల్పిస్తూ చేపట్టిన "బాకీ కార్డు" ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద కోరారు. సోమవారం చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బిఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంటరీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై "బాకీ కార్డు" ఆవశ్యకతను పార్టీ శ్రేణులకు వివరించారు. అనంతరం "బాకీ కార్డు"లను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పార్లమెంటరీ ఇంచార్జ్ లు నాయకులు, కార్యకర్తలతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, మాజీ చైర్మన్లు, మాజీ డిప్యూటీ మేయర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ నగర్ కాలనీలో ఓయో లాడ్జి సీజ్





**పోచారం, అక్టోబర్ 06, (తెలంగాణ దిశ) :**పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ 11వ వార్డు భగత్ నగర్ కాలనీలో సోమవారం మున్సిపల్ అధికారులు ఓయో లాడ్జ్ ను సీజ్ చేశారు. కాలనీలోని ఇంటి నెంబర్ 13-10/75లో అక్రమంగా ఓయో లాడ్జి నిర్వహిస్తున్నారు. సదరు యజమానికి భవనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని గత నెల 25న మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం విధితమే. కానీ భవనానికి సంబంధించి ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు సమర్పించని కారణంగా సోమవారం భవనాన్ని మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సీజ్ చేసారు.

# ఈసీఐఎల్ బస్ టర్మినల్ ప్రాంగణంలో చెత్త కుప్పలు.. ప్రయాణికులకు ఇబ్బందులు

ఈసీఐఎల్ ఆర్టీసీ బస్సు టర్మినల్ లో చెత్త కుప్పలు పేరుకుపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త చెదారంతో పాటు తిని పడేసిన పేపర్ ప్లేట్ల కారణంగా ఈగలు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. కొందరు ప్రయాణికులు పక్కనే కూర్చుని భోజనం చేస్తున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే టర్మినల్ లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.
(కుషాయిగూడ, తెలంగాణ దిశ)



# సంపాదకీయం


## ప్రసాజ్వామ్యంలో నిరంకుశం పనికిరాదు

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా భావించే భారతదేశంలో ఆరోగ్యకరమైన రాజకీయ వాతావరణం లేకుండా పోతోంది. అధికారం చేపట్టిన నేతలు నిరంకుశమనే విషసంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. అన్ని వ్యవస్థలతో పాటు మీడియాపైనా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. తాము కోరుకున్నది మీడియాలో రావాలన్న అహంకారంతో ఉన్నారు. లేకుంటే మాకు వ్యతిరేకంగా మీడియా కథనాలు రాస్తోందని అక్కసు వెళ్లగక్కుతున్నారు. అలాగే మీడియా సంస్థలపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. మీడియా ప్రతినిధులను దరిదాపుల్లోకి రాకుండా చూస్తున్నారు. సొంత మీడియాలను ప్రోత్సహిస్తూ..డబ్బా కొట్టుకుంటున్నారు. అహంకారం పతన హేతవు... ఇది అందరికీ తెలుసు.. కానీ మోడీ, మమతా బెనర్జీ, కెసిఆర్,జగన్ వీరంతా అహంకార పాలకులుగా నిలిచిపోతారనడంలో సందేహం లేదు. మోడీ దేశానికి ఏమీచేయలేదని.. మోడీ అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని అధికారంలో ఉండగా కెసిఆర్ తరచూ మండిపడుతూ వచ్చారు. కానీ కెసిఆర్ అంతకు మించిన అహంకారి అని తెలంగాణలో ఎవరిని అడిగినా చెబుతారు. ఇప్పుడాయన కేవలం తను సృష్టించుకున్న ఏకాంతంలో గడుపుతున్నారు. ప్రజల్లో ఎక్కడా కానరావడం లేదు. ఆయన ఎవరినీ దరిచేరనీయరన్నది కూడా అంతే నిజం. అధికారంలో ఉండగా జనగ్ కూడా అదే తరహాలో ఐదేళ్లు అధికారం ఏలారు. జనాలను దూరంగా పెట్టారు. నిజానికి ప్రజాస్వామ్యంలో అహంకారం, నిరంకుశం పనికిరాదు. మోడీ గురించి విమర్శలు చేస్తున్న ఇండియా కూటమి నేతలు తమగతాన్ని కూడా గుర్తు చేసుకుంటే మంచింది. తమవైపు కూడా జనం చూస్తారని గుర్తించాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లు..వారిచ్చే ఓటుతో నిరంకుశంగా కాకుండా.. ప్రజాస్వామ్య యుతంగా పాలన సాగించాలి. ఓట్లేసుకోవడం ఎలాగో తెలుసుకుని రాజ్యమేలుతున్న మన రాజకీయ నేతలు అధికారంలోకి రాగానే ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కేస్తున్నారు. ప్రజలను పురుగుల్లా చూస్తున్నారు. పోలీసులను తమ గుప్పిట్లో పెట్టుకుని పాలన చేస్తున్నారు. ప్రజల చెంతకు రావడం, వారి గురించి తెలుసుకోవడం అన్నది మరచి పోయారు. ఇలా జరుగుతుందని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మహాశయుడు ఆనాడు ఊహించి ఉండరు. లేకుంటే ఎక్కడో ఒక దగ్గర చెక్ పాయింట్ పెట్టేవారు. ప్రజలకు చేరువగా ఉండాల్సిన నేతలు ప్రస్తుతం గిరిగీసుకుని తమ బంగళాలు దాటి రావడం లేదు. ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. దేశంలో మిగతా నేతల సంగతెలా ఉన్నా... మోడీ, కెసిఆర్, జగన్‌లు అహంకారంలో తారాస్థాయికి చేరుకున్నారు. నిరంకుశంలో హిట్లర్, మోస్సోలీలను మించారు. మోడీని ప్రశ్నించే ముందు ఈ విషయాలను తమకు తాముగా ప్రశ్నించుకుంటే బాగుండేది. ఇకపోతే తెలంగాణలో కెసిఆర్‌కు ముందు సిఎంలుగా పనిచేసిన వారెవరూ ఎవరు కూడా ఇంత నిరంకుశంగా లేరు. దివంగత ప్రజాయుద్దనౌక గద్దర్, కోదండరామ్ తదితర తెలంగాణ ఉద్యమకారులను కూడా కెసిఆర్ దూరం పెట్టిన విషయాన్ని జనం చూశారు. ఉమ్మడి ఎపిలో చెన్నారెడ్డి లాంటి నేత కూడా ఇంత నిరంకుశంగా పాలించ లేదు. దివంగత వైఎస్ కూడా ఎప్పుడూ ప్రజల్లో ఉండేవారు. ఇప్పుడు విభజన తరవాత అటు కెసిఆర్, ఇటు జగన్ పాలనా పగ్గాలు చేపట్టాక నిరంకుశంగా వ్యవహరించడంతో పాటు ఎదుటి పార్టీలను, వ్యక్తులను గంజిలో ఈగ తీసినట్లుగా వ్యవహరించారు. రాష్ట్రాలను అప్పులకుప్పగా తయారు చేశారు. అందుకే జనం వారిని కూడా నిరంకుశంగానే దూరం పెట్టారు. ప్రజాసంక్షేమం పేరుతో డబ్బుల పందేరంతో ఖాజానాను ఊడ్చేస్తున్న నాయకులు ఎప్పటికైనా జవాబుదారీగా ఉండాల్సిందే. అధికారంలో ఉన్న వారు నిజంగా మంచి పనులు చేస్తే ప్రజలు వారిని దూరం పెట్టరు. ప్రజలు నానా అవస్థలు పడుతున్నా వాటిపై పట్టింపు లేకుండా పాలన సాగిస్తున్నారు. ఇక బిజెపి విషయానికి వస్తే..అన్ని రాష్ట్రాల్లో పాగా వేయాలన్న సంకల్పం ఉంటే మంచిదే. అందుకు మంచి పనులు చేస్తే చాలు. ప్రజలకు ఉద్యోగ,ఉపాధి కల్పించి, జివిస్టీ వాయింపులు లేకుండా చేసి, ధరలను అదుపులో పెట్టగలిగితే ప్రజలే నేరుగా వచ్చి ఓటేసి బిజెపిని అక్కున చేర్చుకుం టారు. అలా జరగడం లేదు కనుకనే హిమాచల్, కర్నాటకలో దెబ్బకొట్టారు. ఈ క్రమంలో మోడీ కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. తమ పాలన అంతా బ్రహ్మాండంగా ఉందన్న అహంకారంలో ప్రధాని మోడీ ఉన్నారు. ఎంతో గొప్ప పాలన అందిస్తున్నామని చాటుకుంటున్నారు. త్వరలోనే రెండు రాష్ట్రాలలో జరుగ బోయే అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉంది. ఈ ఎన్నికలకు ముందు అయినా బిజెపిని ప్రజలకు చేరువ చేసేలా మోడీ ప్రజలకు చేరువ కావాలి. ప్రజాస్వా మ్యాన్ని, హక్కులను, న్యాయాన్ని ప్రభుత్వాన్ని, వ్యవస్థలను కాపాడుకోవాల్సి ఉంది. పాలకులు ఇది గమనించి తమపనితీరును మెరుగు పర్చుకుంటే మంచిది. అలాకాకుండా నాయకలు తమ అహంకాన్ని వీడకపోతే కాలగర్భంలో కలసిపోక తప్పదు. ప్రజలతో మంచి అనిపించుకునేలా నిర్ణయాలు తీసుకోవాలి. కేంద్రంలో అయినా రాష్ట్రాల్లో అయినా పాలకులు నిజాయితీగా సాగాలి. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలి.

# హనుమాన్ మూవీ ప్రొడ్యూసర్ చైతన్యరెడ్డి, హైడ్రా ఏసిపి తిరుమల్ లకు హైకోర్టు నోటీసులు




**హైదరాబాద్, అక్టోబర్ 06, (తెలంగాణ దిశ) :** హనుమాన్ మూవీ ప్రొడ్యూసర్ చైతన్యరెడ్డి, హైడ్రా ఏసిపి తిరుమల్ లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని తన రెండు ఎకరాల స్థలంలో వర్టెక్స్ వర్మ అక్రమంగా నిర్మించిన 150 ఫీట్ల రోడ్డును కూల్చేందుకు కొందరు వ్యక్తుల ద్వారా రూ. 50 లక్షలు హైడ్రా అధికారులకు లంచం ఇచ్చినట్టు చైతన్యరెడ్డి తెలిపినట్లు హైడ్రా ఏసిపి తిరుమల్ పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. ఈ విషయంపై న్యాయవాది సుంకర నరేష్ ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వ చూపి పని చేయించు కోవాలనుకోవడం కూడా అవినీతి నిరోధక చట్టం ప్రకారం నేరం కాబట్టి సదరు చైతన్యరెడ్డి, హైడ్రా ఏసీపీ తిరుమల్ లపై కేసు నమోదు చేయాలని అవినీతి నిరోధక శాఖకు చేసిన ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు



తీసుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరుపున న్యాయవాది బలమైన వాదనలు వినిపించారు.

ఏసీబీ స్టాండింగ్ కౌన్సిల్ వాదనలు వినిపిస్తూ హైడ్రా, ఏసిపి మీద కేసు నమోదు చేయడానికి ముందస్తు అనుమతి కోసం రాచకొండ కమీషనర్ కు లేఖ రాసారు. అక్కడి నుండి అనుమతి రాగానే చర్యలు చేపడతామని తెలిపారు.

ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం ఎటువంటి విచారణ లేకుండా ఆరోపణల మీద పిటిషనర్ మీద ఏ విధంగా కేసు పెడతారని ప్రశ్నించింది. ఈ కేసులో చైతన్య రెడ్డి, హైడ్రా ఏసిపి తిరుమల్ లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది

# టూ టైర్ సిటీస్‌లో ఉగ్రజాడలు!



**నిజామాబాద్, తెలంగాణ దిశ :** భారతదేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు గతంలో పెద్ద నగరాల్లోనే పరిమితమై ఉండేవి. కానీ ఇటీవలి సంఘటనలు చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకూ ఈ ముప్పు విస్తరిస్తున్నట్లు సూచిస్తున్నాయి. ఇక పట్టుబడుతున్నవారిలో 30 ఏళ్లలోపు యువత ఉండడం మరింత ఆదోళన కలిగిస్తోంది. తాజాగా ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్, ఎన్ఐఏ, ఇంటలిజెన్స్ ఏజెన్సీలు సంయు క్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఇసిస్ (ఐఎస్ఐస్) లింక్స్‌తో ఉన్న ఐదుగురు యువకులు అరెస్టయ్యారు. ఈ మాడ్యూల్ ఢిల్లీలో బాంబు దాడులు, విధ్వంసకర కార్యకలాపాలు చేపట్టేందుకు సిద్ధమవుతుందని పోలీసులు వెల్లడి చేశారు. ఈ అరెస్టులు దేశవ్యాప్తంగా ఉగ్రవాద నెట్‌వర్క్‌ల వ్యాప్తిని, ముఖ్యంగా తెలంగాణ, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతా ల్లోని చిన్న పట్టణాలకూ విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది.తాజా ఆపరేషన్ డిల్లీ పోలీసుల స్పెషల్ సెల్‌కు రహస్య సమాచారం ఆధారం గా ప్రారంభమైంది. ఢిల్లీ నుంచి ముంబై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు రాంచీలోని ఆషర్ దానిష్‌ను కలవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ఈ ఇద్దరు, ముంబైకు చెందిన అఫ్తాబ్ కురేషీ, సుఫియాన్ అబూబకర్ ఖాన్, ఢిల్లీ రైల్వే స్టేషన్ వద్ద అరెస్టయ్యారు. వీరి వద్ద సెమీ?ఆటో మేటిక్ పిస్తల్స్, 50 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, దేశీయ తుపాకీ, ఎయిర్ గన్ పట్టుకున్నారు. రాంచీలో దానిష్‌ను పట్టుకున్నప్పుడు అతని లాడ్జీలో బాంబు తయారీకి ఉపయోగపడే కెమికల్స్(సల్ఫ్యూరిక్ ఆసిడ్, నైట్రిక్ ఆసిడ్, సల్ఫర్ పౌడర్), కప్పర్ షీట్స్, స్టీల్ పైప్స్, సర్క్యూట్ బోర్డులు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్‌లు సేకరించారు. దానిష్, బుకారో (ఝార్ఖండ్) నివాసి, ఇంగ్లి?లష్ పోస్ట్ గ్రాజ్యుయేట్, 8 నెలలుగా రాంచీలో ఉంటూ 'గజ్వా లీడర్', 'సీఈఓ' అనే కోడ్ పేర్లతో మాడ్యూల్‌ను నడుపుతున్నాడు. అతను వాట్సాప్ గ్రూప్‌లలో తనను 'ప్రొఫెసర్'గా పరిచయం చేసుకుని, యువకులను రాడికలైజ్ చేస్తూ, పాకిస్తాన్ హ్యాండ్లర్స్‌తో సంప్రదింపులు జరిపేవాడు.

మధ్యప్రదేశ్‌కు చెందిన కమ్రాన్ ఖురేషీ, ఫండింగ్‌ను హ్యాండిల్ చేసేవాడు. మొత్తం ఐదుగురు అరెస్టులు: దానిష్, అఫ్తాబ్, సుఫియాన్, కమ్రాన్, తెలంగాణకు చెందిన మహ్మద్ యమాన్(బోధన్). వీళ్లంతా 26 ఏళ్లలోపు యువకులు. ఈ మాడ్యూల్ 'ప్రాజెక్ట్ ముస్తఫా' పేరుతో భారతదేశంలో ఖిలాఫత్ స్థాపించడానికి, బాంబు పేలుళ్లు, ఫిదాయీన్ దాడులు చేపట్టేందుకు సిద్ధమవుతుంది. ఐసిస్ ఆన్‌లైన్ రాడికలైజేషన్ ప్రోగ్రామ్‌ల ద్వారా యువకులను రిక్రూట్ చేస్తూ, ఢిల్లీలో ఆపరేషన్‌లు నిర్వహించేందుకు యత్నించారు.తెలంగాణలో ఈ మాడ్యూల్‌కు బోధన్ (నిజామాబాద్ జిల్లా) లింక్ బయటపడటం ఆశ్చర్యకరం. మహ్మద్ యమాన్(20 ఏళ్లు), అనీస్‌నగర్ నివాసి, ఢిల్లీ పోలీసులు రహస్యంగా బోధన్‌లో దాగి ఉండి అరెస్టు చేశారు. అతని వద్ద పిస్తల్ పట్టుకున్నారు. యమాన్ దానిష్‌తో వీడియో కాల్స్ ద్వారా సంప్రదింపులు జరిపేవాడని పోలీసులు తెలిపారు. బోధన్ వంటి చిన్న పట్టణంలో ఇలాంటి లింక్ బయటపడటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో తెలంగాణలో ఉగ్రవాద కార్యకలాపాలు హైదరాబాద్ పాత్‌బస్తీ కేంద్రంగా జరిగేవి. కానీ ఇప్పుడు బోధన్, నర్సాపూర్, నల్గొండ వంటి ప్రాంతాల్లో లింకులు బయటపడుతున్నాయి. 2022లో బోధన్‌లోనే పాకిస్తాన్‌తో లింక్స్ ఉన్న 60 మందికి పాస్‌పోర్టులు ఇచ్చిన ర్యాకెట్ బయటపడింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఒకరు పట్టుబడి, ప్రశ్నించగా మొత్తం చిరునామా బయటపడింది. అలాగే, బోధన్‌లో కరాటే ఇన్‌స్ట్రక్టర్ అబ్దుల్ ఖాదర్ (52 ఏళ్లు)ను 2022లో అరెస్టు చేశారు. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) తరఫున మతోన్మాదాన్ని పెంచి, 200 మంది యువకులకు కరాటే, కుంగ్‌ఫు, ఆయుధాలు శిక్షణ ఇచ్చేవాడు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అలాంటి కరాటే ఇన్‌స్ట్రక్టర్లు పట్టుబడ్డారు. ఈ సంఘటనలు చిన్న పట్టణాల్లో రాడికలైజేషన్, రిక్రూట్‌మెంట్ పెరుగుతున్నట్లు చూపిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లోని జియాగూడ, మల్లెపల్లిలో ఇసిస్ లింక్స్‌తో ఉన్నవారు పట్టుబడ్డారు. రాయచూర్ (కర్ణాటక)లో ఇద్దరు ఇటీవల అరెస్టయ్యారు. చిత్తూరు జిల్లా మదనపల్లెలో లష్కర్?ఏ?తొయిబా సభ్యుడు పట్టుబడ్డాడు. ఈ అరెస్టులు స్థానికుల మధ్య దాగి ఉండి కార్యకలాపాలు చేస్తున్నారని సూచిస్తున్నాయి.గతంలో ఉగ్రవాదులు హైదరాబాద్ పాత్‌బస్తీ, ఢిల్లీ వంటి పెద్ద సెంటర్లలో దాగి ఉండేవారు. కానీ ఇప్పుడు బోధన్, నర్సాపూర్ వంటి చిన్న పట్టణాల్లో వ్యాప్తి చెందడం ఆందోళనకరం.

వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా యువకులను సులభంగా రిక్రూట్ చేయడం. దానిష్ వంటివారు 'ప్రొఫెసర్', 'సీఈఓ' రూపంలో ట్రైనింగ్ ఆఫీసర్‌లుగా పనిచేస్తూ, ఇసిస్ ఐడియాలజీని వ్యాప్తి చేస్తున్నారు. చిన్న పట్టణాల్లో స్థానికులతో కలిసి జీవించడం సులభం. బోధన్‌లో యమాన్ వంటివారు సాధారణ యువకులుగా కనిపించి, ఆయుధాలు, కెమికల్స్ సేకరిస్తున్నారు. పాకిస్తాన్ హ్యాండ్లర్స్ ద్వారా ఫండింగ్, ట్రైనింగ్. వంటి సంస్థలు మతోన్మాదాన్ని పెంచి, మార్షల్ ఆర్ట్స్ శిక్షణల ద్వారా యువకులను తయారు చేస్తున్నాయి. ఈ మాడ్యూల్స్ ఢిల్లీ వంటి పెద్ద నగరాల్లో దాడులు చేపట్టితే, దేశ భద్రతకు తీవ్ర ముప్పు. చిన్న పట్టణాల్లో వ్యాప్తి పోలీసులకు మానిటరింగ్‌లో కష్టం. యువకులు (20?26 ఏళ్లు) రిక్రూట్ అవ్వడం సమాజంలో మత సంక్షోభాలకు దారి తీస్తుంది. ఈ ట్రెండ్ దేశ భద్రతకు కొత్త సవాలుగా మారుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఇంటలిజెన్స్ షేరింగ్ పెంచి, ఉగ్రవాదాన్ని మూలాల వద్ద నివారించాలి. లేకపోతే, చిన్న పట్టణాలు కూడా పెద్ద ముప్పులకు దారి తీస్తాయి.

# లోకేష్ ఫస్ట్ టాస్క్ కంప్లీటెడ్!

**విజయవాడ, తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన తనయుడు లోకేశ్ కోసం రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు స్పష్టంగా తెలుస్తుంది. చంద్రబాబు ఒక మార్గాన్ని ఏర్పరుస్తున్నట్లు కనపడుతుంది. రహదారిని ఏర్పాటు చేసి లోకేశ్ రాజకీయ ప్రయాణానికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎక్కువగా చంద్రబాబు ఈ టర్మ్ లో కనిపిస్తుంది. గతంలో మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో చంద్రబాబు నాయుడులో ఈ ఆలోచన లేదు. ఆయన మదిలోకి కూడా రాలేదు. కానీ లోకేశ్ చేతికి అందిరావడంతో తన కళ్ల ముందే కుమారుడిని అందలం ఎక్కించాలన్నది కన్నతండ్రి తాపత్రయం చంద్రబాబులో స్పష్టంగా కనిపిస్తుంది. లోకేశ్ ను ప్రజల్లోకి పంపడమే కాకుండా ఆయనకు రాజకీయాల్లో ఎత్తుపల్లాలను గురించి ప్రాక్టికల్స్ గా ఈ ఐదేళ్ల కాలం ఉపయోగించేటట్లే కనపడుతుంది. . ఇప్పటికే తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల విషయంలో లోకేశ్ దే పైచేయి కనిపిస్తుంది. లోకేశ్ కు ప్రత్యేక టీం ఉంది. ఆయన పార్టీ కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తూ కార్యకర్తలతో పాటు పార్టీ నేతలను కూడా గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కార్యకర్తలలో జోష్ నింపుతూనే వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నారు. టీడీపీ ముఖ్య కార్యకర్త కు ఏ ఆపద వచ్చినా వెంటనే లోకేశ్ క్షణంలో సోషల్ మీడియాలో స్పందించడమే కాకుండా ఆపదలో ఉన్న వారికి వెంటనే సాయాన్ని కూడా ప్రకటిస్తున్నారు. తాను స్వయంగా ప్రకటించడమే కాకుండా స్థానిక నేతలను పురమాయించి కార్యకర్తలను ఆదుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. అప్పుడేనా? టీడీపీ మంత్రులతో కూడా... ఇక మంత్రివర్గ సమావేశం ప్రారంభానికి ముందు టీడీపీకి చెందిన మంత్రులతో లోకేశ్ గత కొన్ని దఫాలుగా ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. వారితో మంత్రివర్గ భేటీ కంటే ముందుగా మాట్లాడుతున్నారు. ఒకరకంగా మినీ కేబినెట్ మీటింగ్ లోకేశ్ నిర్వహిస్తున్నారని పార్టీకి చెందిన నేతలే అంటున్నారు. కూటమిలోని మిత్ర పక్షాలకుచెందిన మంత్రులను ఈ సమావేశాలకు పిలవకపోయినా అత్యధిక సంఖ్యలో ఉన్న తన పార్టీకి చెందిన మంత్రులతో సమావేశమై వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికైతే ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఒక క్లారిటీ మాత్రం వచ్చేసింది. లోకేశ్ నేరుగానే ఆదేశాలు జారీ చేస్తుండటం తో త్వరలోనే ఆయన అందలం ఎక్కడం ఖాయమన్న కావెంట్స్ సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ కూడా... ఇటీవల లోకేశ్ తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తుండటం, కేంద్ర మంత్రులతో సమావేశాలు, మోదీ, అమిత్ షాలతో భేటీలు వంటి వాటితో మరింతగా రాజకీయాలను అందిపుచ్చుకునేలా చంద్రబాబు నాయుడు అవకాశం కల్పిస్తున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలకు ముందు కూడా లోకేశ్ ఢిల్లీకి వెళ్లడం, పార్టీ ఎంపీలతో కలసి మాట్లాడటం వంటివి ఈ తరహాలోనివే. కార్యకర్తలకు, పార్టీ నేతలకు, మంత్రులకు, ఎంపీలకు అయితే ఒక క్లారిటీ వచ్చింది. వచ్చే ఎన్నికల వరకూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఆయన నాయకత్వంలోనే వెళతారంటున్నారు. అదే వచ్చే ఎన్నికల్లో తిరిగి కూటమి ప్రభుత్వం విజయం సాధిస్తే మాత్రం ఖచ్చితంగా నారా లోకేశ్ ప్రభుత్వ పగ్గాలు చేపట్టడం ఖాయమన్న అభిప్రాయం ఇప్పుడు పార్టీలో మార్మోగుతుంది. అందుకే ఇప్పటి నుంచే టీడీపీ అంతా లోకేశ్ చుట్టూ తిరుగుతుండటానికి అదే కారణమన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. లోకేష్.. ఎలా మారారు.. ఎంతలా మారారు: మంత్రి నారా లోకేష్. ప్రతికూలతల నుంచి ఎదగాలనుకునే యువ నాయకులకు ఆయన ఒక ఆదర్శం. ఎలాంటి లోకేష్.. ఎలా మారారు.. ఎంతలా మారారు అనేది ఇప్పుడు ప్రధాన చర్చ. పప్పు అన్నవారే ఇప్పుడు పప్పులో కాలేశామని బాధపడుతున్నారు. లోకేష్ విషయంలో తప్పు చేశామని పశ్చాత్తాప పడుతున్నారు. అప్పుడెప్పుడో తండ్రి చాటు బిడ్డను చూసి.. వచ్చిరాని మాటను చూసి ఏవేవో వాగేశారు. కానీ ప్రతి మాటను, ప్రతి అడ్డంకిని గుణపాఠంగా మార్చుకున్నారు లోకేష్. నిమిషానికి నిమిషానికి.. ప్రతి గంటకు.. ప్రతి రోజుకు.. ప్రతి నెలకు.. ప్రతి ఏడాదికి తనలో ఉన్న పరిణితిని పెంచుకున్నారు లోకేష్. ఎవరైతే ఎగతాళి చేశారో? ఎవరైతే తక్కువ చేసి మాట్లాడారో? వారందరికీ తన పనితీరు ద్వారా సమాధానం చెప్పారు.

# యూరియా టెన్షన్.. డిమాండ్‌ఫుల్.. స్టాక్‌నిల్..?



**వరంగల్, తెలంగాణ దిశ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో యూరియా కొరత రైతులతో పాటు అధికారులను వేధిస్తోంది. పంటల సాగు విస్తీర్ణంకు తగినంత యూరియా సరఫరా లేదు. ప్రతి రోజు వచ్చే స్టాకు రైతుల డిమాండ్ కు సరిపోవడం లేదు. సొసైటీల వద్ద అర్ధరాత్రి నుంచే రైతులు క్యూలో వేచిచూసినా యూరియా రాక ఆందోళనలు చేస్తుండడంతో ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో ఇబ్బందులు పడుతు న్నారు. డిమాండ్ కు అనుగుణంగా యూరియా సరఫరా లేకపోవ డం, నిత్యంవచ్చే స్టాక్ కు బట్టి రైతులకు పంపిణీ చేసినా ఆందో ళనలు తగ్గకపోవడంతో కొంతమంది వ్యవసాయ, సహకార శాఖల అధికారులు ఇతర శాఖల్లోకి డిప్యూటేషన్ పై వెళ్లేందుకు సిద్ధమవుతు న్నారు. వీలు కాకుంటే కొంతమంది అధికారులు వివిధ కారణాలు చెప్పి లాంగ్ లీవ్ పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొంత మంది అధికారులు ఉమ్మడి జిల్లా నుంచి బదిలీ చేయించుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

డిమాండ్ ఎక్కువ.. స్టాకు తక్కువ..: ఉమ్మడి జిల్లాలో సాగుకు అనుకూలమైన భూమి 17లక్షల 80వేల ఎకరాల వరకు ఉంది. అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా ఈ సీజన్లో 16లక్షల 70వేల ఎకరాలకు పైగా సాగైంది. పత్తి, మొక్కజొన్న, వరిసాగే ఎక్కువ. ఈ పంటలే మొత్తం సాగు విస్తీర్ణంలో 80 శాతం వరకు చేశారు. పంటలను కాపాడుకునేందుకు అధిక దిగుబడి వస్తుందనే నమ్మకంతో గత కొన్నేళ్లుగా రైతులు ఎక్కువ మొత్తంలో యూరియాను వినియోగిస్తున్నారు. భారీ స్థాయిలో కొనుగోలు చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం లాగానే ఈ సీజన్ లో వేసేందుకు తిప్పలు పడుతున్నారు. యూరియా కోసం నిత్యం సొసైటీల వద్ద బారులు తీరుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిధిలో యూరియా కోసం నెలరోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా క్యూ లైన్ లో ఉండి యూరియా కోసం తిప్పలు పడుతున్నారు. స్టాక్ వచ్చిన విధంగా యూరియాను తీసుకువెళు న్నారు. యూరియా దొరకని సమయంలో సొసైటీతో పాటు మండల కార్యాలయాల ఎదుట ఆందోళనకు దిగుతున్నారు. వీరి ఆందోళలను అడ్డుకోవడం వ్యవసాయ, సహకార శాఖల అధికారులతో పాటు పోలీసులకు సమస్యలను తెచ్చి పెడుతుంది.

ఉమ్మడి జిల్లా పరిధిలో నెలరోజులు గా వస్తున్న స్టాక్ ను బట్టి ఆయా మండలాల పరిధిలోని సొసైటీలతో పాటు ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణా లకు పంపిస్తున్నారు. ఆ స్టాక్ కు అనుగుణంగానే మండలాల రైతులకు వారి పంటల విస్తీర్ణం బట్టి ఎకరాకు ఒక బస్తా చొప్పున అధికారులు పంపిణీ చేస్తున్నారు. కొన్ని సొసైటీల పరిధిలో స్టాక్ తక్కువ వచ్చిన సమయంలో విస్తీర్ణం ఎంత ఉ న్నా ఒకటి, రెండు బస్తాలకు మించి ఇవ్వడం లేదు. వచ్చే స్టాక్ ను బట్టి ఈ యూరియా సరఫరా చేస్తున్నారు. గతేడాదికంటే భిన్నంగా స్టాక్ తక్కువగా రావడం, రైతులు వాడకం ఎక్కువగా ఉండడంతో ఉమ్మడి జిల్లాలో రైతుల ఆందోళనలు ఎక్కువగా జరుగుతున్నాయి. వ్యవసాయ అధికారులు ముందస్తుగానే వచ్చే స్టాక్ ను బట్టి సొసైటీల పరిధిలోని గ్రామాల రైతులకు టోకెన్లు జారీ చేసినా అంతకుమించి రైతులు రావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్టాక్ రాత్రివేళ వచ్చిన సమయంలో సొసైటీలలో ఉదయం 5 గంటల నుంచి యూరియా పంపిణీ చేస్తున్నా కొన్నిసార్లు రైతులను అదుపుచేయడం వ్యవసాయ, సొసైటీ అధికారులకు కష్టంగా మారింది. అర్ధరాత్రి నుంచే సొసైటీల వద్దకు మహిళలు, పిల్లలు ఎక్కువగా రావడంతో తగిన ఏర్పాట్లు లేక సమస్యలు తలెత్తుతున్నాయి.

తగ్గని రైతుల ఆందోళనలు..: సొసైటీల వద్దకు రైతులు ఎక్కువగా రాత్రివేళలో వచ్చి యూరియా కోసం నిలబడడం, ఆందోళనలు చేపట్టడంతో మండల స్థాయిలోని ఏఈవోలు, ఏవోలు, ఏడీఏలు ఇబ్బందులు పడుతున్నారు. స్టాక్ తక్కువగా రావడం, రైతుల నుంచి ఒత్తిళ్లు పెరగడం, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా వ్యవసాయ అధికారులపై ఒత్తిళ్లు పెంచడంతో వారు ఉ క్కిరి బిక్కిరి అవుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా పనిచేసినా ఇబ్బందులు తప్పకపోవడంతో కొంత మంది అధికారులు డిప్యూటేషన్ పై ఇతర విభాగాల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మరికొంత మంది వివిధ కారణాలు చెప్పి లాంగ్ లీవ్ లో వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మండల స్థాయి అధికారి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ఒత్తిళ్లు పెరగడంతో కొంత మంది ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లేం దుకు సిద్ధమవుతున్నారు. సాగుకు అనుగుణంగా సరఫరా లేకపోవడం తో తమకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయ ని కొంత మంది వ్యవసాయ అధికారులు వాపోతున్నారు. నేతల ఒత్తిళ్లు పెర గడంతో పనిచేయని పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. స్టాక్?తక్కువగా ఉండటంతో తాము ఏమిచేయలేని పరిస్థితి ఉందని కొంతమంది అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్రప్ర భుత్వాలు యూరియా సరఫరాను పెంచితే రైతుల ఆందోళనలు సమసిపోయి అధికారులపై ఒత్తిళ్లు తగ్గనున్నాయి.



## 11 రాష్ట్రాలు విపరీత అప్పులు!

న్యూఢిల్లీ, : పదేళ్లలో దేశం ఐదో ఆర్థిక శక్తిగా ఎదిగింది. రాబోయే ఐదేళ్లలో మూడోస్థానంలో నిలవడమే తమ లక్ష్యం అని బీజేపీ నేతలు పదే పదే చెప్పుకుంటున్నారు. 2024 ఎన్నికల మేనిఫెస్టోలోనూ దీనిని ప్రధానంగా పేర్కొన్నారు. 5 స్థానానికి వచ్చింది నిజమే కానీ, మూడోస్థానం అంత ఈజీ కాదు. ఇక ఆర్థికంగా ఎదిగినా.. అప్పుల్లో కూడా గణనీయమైన వృద్ధి కనిపిస్తోంది. కాగ్ తాజా నివేదిక ప్రకారం, 2013?14 నుంచి 2022?23 వరకు 28 రాష్ట్రాల మొత్తం ప్రభుత్వ రుణం 17.57 లక్షల కోట్ల నుండి 59.60 లక్షల కోట్లకు చేరింది, అంటే 3.3 రెట్లు పెరిగింది. ఈ పరిణామం రాష్ట్రాల ఆర్థిక ఉ త్పాదకతను బలహీనపరుస్తూ, స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో రుణ శాతం 16.66 నుంచి 23 శాతానికి పెరిగింది. ఇది దేశ జీడీపీలో 22.17 శాతానికి సమానమైన 268.9 లక్షల కోట్ల భారాన్ని సృష్టించింది. ఈ ట్రెండ్ ఆర్థిక వృద్ధి మూలాలను దెబ్బతీస్తూ, భవిష్యత్ పెట్టుబడులకు అడ్డంకిగా మారుతోంది.రుణ స్థాయిలు రాష్ట్రాల మధ్య విస్తృతంగా మారుతున్నాయి. 2023 చివరి నాటికి, పంజాబ్ 40.35 శాతం జీఎస్‌డీపీతో అత్యధికం, నాగాలాండ్ 37.15 శాతం, పశ్చిమ బెంగాల్ 33.70 శాతంతో వచ్చాయి. ఇక బీజేపీ పాలిత గుజరాత్ 16.37 శాతం, మహారాష్ట్ర 14.64 శాతం రుణాలు నమోదయ్యాయి, అయితే ఒడిశా 8.45 శాతంతో తక్కువ రుణాలు తీసుకుంది. మొత్తంగా, ఎనిమిది రాష్ట్రాలు 30 శాతం మించిన రుణాలతో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ వైవిధ్యం పాలనా విధానాలు, ఆదాయ వనరుల పంపిణీలోని అసమానతలను ప్రతిబింబిస్తుంది.ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, కేరళ, బీహార్, తమిళనాడు సహా 11 రాష్ట్రాలు 2023లో ఆర్థిక నిబంధనలు ఉల్లంఘించి రోజువారీ ఖర్చులకు కూడా రుణాలు సేకరించాయి. రుణాలు పెట్టుబడులకు మాత్రమే పరిమితం కావాలి, కానీ ఈ రాష్ట్రాలు బాండ్లు, ట్రెజరీ బిల్లులు, బ్యాంకు రుణాలు, ఆర్‌బీఐ వెయ్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఎల్ఐసీ, నాబార్డ్ వంటి మార్గాల ద్వారా దీన్ని చేశాయి. ఇది రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని హరించాయి. దీర్ఘకాలిక స్థిరత్వానికి ముప్పుగా మారింది.


# మావోయిస్టులకు దారేదీ..?



**ఖమ్మం, తెలంగాణ దిశ :** ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టు పార్టీ ఉ క్కిరిబిక్కిరి అ వుతోంది.పార్టీ ప్రధాన కార్యదర్శి సహా ముఖ్య నేతలంతా భద్రతా బలగాల చేతుల్లో ఎన్‌కౌంటర్ అవుతున్నారు. పార్టీ మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ఈ తరుణంలో మావోయిస్టుల మధ్య ఉన్న సైద్ధాంతిక విభేదాలు బయటపడ్డాయి. శాంతి చర్చల కోసం తుపాకీ పక్కన పెడతామని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ అలియాస్ అభయ్ పేరుతో లేఖ విడుదల చేశారు. ఈ లేఖ విడుదల కాగానే దేశవ్యా ప్తం గా పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఎందుకంటే, మావోయిస్టు పార్టీకి తుపాకీ అనేది ఒక ఆయుధం మాత్రమే కాదు, అది ఒక సిద్ధాంతం. అయితే, ఈ ఆయుధాలు పక్కన పెడతామని అభయ్ పేరిట వచ్చిన లేఖను ఖండిస్తూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధి జగన్ పేరుతో మరో లేఖ విడుదల కావడం తీవ్ర చర్చకు దారి తీసింది. తుపాకీ పక్కన పెట్టడం అనేది పార్టీ కేంద్రకమిటీ సభ్యుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, పార్టీ ఆలోచన అది కాదని ఆ లేఖలో స్పష్టం చేయడం జరిగింది. దీంతో మావోయిస్టు పార్టీలో సైద్ధాంతిక విభేదాలు బయటపడినట్లయిం ది. అయితే, అసలు తుపాకీ పక్కన పెట్టాలా వద్దా అన్న విషయంలో ఇంత పెద్ద చర్చ జరగడం వెనుక కారణాలు ఏంటి? మావోయిస్టు పార్టీ తుపాకీ విషయంలో ఎందుకు ప్రాధాన్యత ఇస్తుంది అన్న అంశాలు ఈ కథనం ద్వారా తెలుసుకుందాం. మన దేశంలో అధికారంలోకి రావాలంటే బ్యాలెట్ ద్వారా రాజకీయ అధికారం దక్కుతుంది. కానీ, మావోయిస్టు పార్టీ సిద్ధాంతం ప్రకారం, రాజకీయ అధికారం తుపాకీ గొట్టం ద్వారానే ఉద్భవిస్తుంది. ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదిం చింది మావో జెడాంగ్. మావో జెడాంగ్ (1893–1976) చైనా కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపకుడు, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాకు మొదటి అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన మార్క్సిజం, లెనినిజంల ఆధారంగా మావోయిజం అనే కొత్త విప్లవ సిద్ధాంతానికి రూపకల్పన చేశారు. దీర్ఘకాలిక సాయుధ పోరాటం ద్వారా చైనాను ఏకం చేసిన వ్యక్తి. చైనాలో నాటి భూస్వామ్య వ్యవస్థను రద్దు చేసి నవ చైనా రూపకల్పనకు నాంది పలికిన వ్యక్తి. చైనాలో కమ్యూనిస్ట్ పార్టీని శక్తివంతమైన రాజకీయ, సైనిక శక్తిగా రూపొందించడంలో మావో జెడాంగ్ కీలక పాత్ర పోషించారు. 'తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం' అన్న సాయుధ విప్లవ సిద్ధాంతాన్ని ప్రవచించింది మావోనే. ఆయన సిద్ధాంతాలు మన దేశంతోపాటు లాటిన్ అమెరికా, మరి కొన్ని ప్రపంచ దేశాల్లో విప్లవోద్యమాలను నడిపించాయి. ఆయన సిద్ధాంతాల ప్రభావం ఇప్పటికీ ప్రపంచ రాజకీయాలపై కనిపించడం విశేషం. ఈ సిద్ధాంతాన్ని మావో 1938లో ప్రతిపాదించారు. 1938లో చైనా – జపాన్ యుద్ధం జరుగుతున్న రోజుల్లో చైనా కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో మావో ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. 'యుద్ధం – వ్యూహాత్మక సమస్యలు' అనే ప్రసంగంలో ఈ సిద్ధాంతాన్ని మావో వివరించారు. యుద్ధం అనేది రాజకీయ లక్ష్యాలను సాధించే ఒక సాధనంగా చెప్పారు. యుద్ధం ద్వారానే అంటే ఆయుధంతోనే ప్రజలు అధికారంలోకి వస్తారని, "రాజ కీయ అధికారం అనేది తుపాకీ గొట్టం నుండే వస్తుంది" అని ఎంతో మంది విప్లవకారులను తుపాకీ పట్టేలా ప్రేరేపించే సిద్ధాంతాన్ని ప్రకటిం చారు. మావో చెప్పిన ఈ సిద్ధాంతం విప్లవ పార్టీలకు, విప్లవకారుల కు కీలకమైన విషయంగా మారింది. సాయుధ పోరాటం ద్వారానే సమసమాజ స్థాపన జరుగుతుందని మావోయిస్టు పార్టీతో సహా సాయు ధ పోరాటం అనుసరించే కమ్యూనిస్ట్ అండ్ మావోయిస్టు పార్టీలు ప్రపంచవ్యాప్తంగా నమ్మడం ప్రారంభించాయి. భూస్వామ్య వ్యవస్థలు, పాలక వర్గాలు ప్రజలను అణిచివేస్తుంటే వారికి విముక్తి కల్పించేది సాయుధ పోరాటమే, అందుకు తుపాకీ పట్టాల్సిందే అన్న సిద్ధాంతం ఇక్కడినుండే మొదలైంది. శాంతియుత నిరసనలు, శాంతి మార్గం లేదా బ్యాలెట్ పద్ధతిలో ఈ మార్పు జరగదన్నది మావోయిస్టు పార్టీ సిద్ధాంతం గా మారింది. ఇక మన దేశంలో ఈ సిద్ధాంతం నక్సల్ బరీ ఉద్యమం నుంచి ప్రారంభమైంది. చారు మజుందార్ ఈ సిద్ధాంతపరమైన ఉ ద్యమానికి నాంది పలికారు. మావో జెడాంగ్ ప్రతిపాదించిన ఈ సిద్ధాంతాన్ని మన దేశంలోని భూస్వామ్య వ్యవస్థ దోపిడీని అరికట్టేందుకు అమలు చేయాలని నిర్ణయించారు. నక్సల్ బరీ ఉద్యమానికి సిద్ధాంతకర్త చారు మజుందార్ కాగా, ఈ తరహా ఉద్యమాన్ని ప్రారంభించిన నాయకుల్లో కానూ సన్యాల్ కూడా ఒకరిగా చెప్పాలి. 'తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం' అనే సిద్ధాంతం నాటి ఆంధ్రప్రదేశ్, దండకారణ్యం వంటి ప్రాంతాలకు విస్తరింప జేసిన నాయకుల్లో కొండపల్లి సీతారామయ్యది కూడా కీలక పాత్ర. నాడు పీపుల్స్ వార్ గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కార్యకలాపాలు ప్రారంభించిన పార్టీ 2004లో మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియాగా ఏర్పడింది. అప్పటి నుంచి మావో జెడాంగ్ ప్రతిపాదించిన సాయుధ పోరాటం ద్వారా రాజ్యాధికారం అనేది అధికార సిద్ధాంతంగా మారింది. తుపాకీ అనేది మావోయిస్టు పార్టీకి ఒక ఆయుధం కాదు. అది వారి పార్టీ సిద్ధాంతం. తుపాకీ పక్కన పెట్టడం అంటే సిద్ధాంతాన్ని పక్కన పెట్టడంలాంటిదేనని ఈవిప్లవ పార్టీలను దగ్గరగా చూసే చరిత్రకా రులు చెబుతారు. అయితే, తుపాకీ ప్రాముఖ్యతపై ఇప్పుడు ఆ పార్టీలోనే భిన్న స్వరాలు వినిపపిస్తున్నాయి. అందులో భాగమే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు విడుదల చేసిన లేఖ, దాన్ని ఖండిస్తూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధి జగన్ విడుదల చేసిన లేఖ. మారిన పరిస్థితులకు అనుగుణంగా తుపాకీ వదలి శాంతియుత మార్గాల ద్వారా లక్ష్యాన్ని చేరుకోవాలని కొందరు ప్రతిపాదిస్తుంటే, తుపాకీ విడిచిపెడితే ఉద్యమం బలహీనమవుతుందని మరికొందరి వాదన. ఈ భిన్నాభిప్రాయాల తోనే పార్టీలో చీలికలు రావచ్చని, అందులో భాగమే ఈ లేఖాస్త్రాలని కొద్ది మంది విశ్లేషకుల మాట. అయితే, ఏది ఏమైనా మావోయిస్టు పార్టీకి తుపాకీ అనేది పోరాట మార్గం కోసం మాత్రమే కాదు, అది రాజకీయ అధికారం కోసం అడుగులు వేసే ప్రాథమిక మార్గం అని చెప్పవచ్చు. అయితే, ఈ విషయంలో మావోయిస్టు పార్టీ అధికారిక నిర్ణయం ఏంటా అన్న ఉత్కంఠ మాత్రం ఇప్పుడు దేశవ్యాప్తంగా నెలకొంది. మరో వైపు భద్రతా బలగాలు మాత్రం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అంతం చేసేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నాయి.

# మూసీ గొంతులో మల్లన్న నీళ్లు...

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** నగరంలో చెరువుల సంరక్షణ పేరిట మొదలైన కూల్చివేతల కన్ను మూసీ నది పరీవాహక ప్రాంతంపై పడింది. నది ఇరువైపులా భూమిని కబ్జా చేసుకొని ఇళ్లు కట్టుకున్నారని వాటిని గుర్తించి, ఇళ్లకు మార్కింగ్ చేసి అక్కడి సామాన్య కుటుంబాలను బెంబేలెత్తించారు. వారంతా చిన్న వ్యాపారాలు, దినసరి కూలిపై బతికేవాళ్లే. ఎన్నో ఏండ్లుగా ఉంటూ, అక్కడే పుట్టి పెరిగినవారు ఇప్పుడు తట్ట బుట్ట పట్టుకొని ఎటు పోవాలని అధికారులను నిలదీశారు. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ప్రభుత్వ చర్యను తప్పుబట్టాయి. మూసీ పక్కన ఓ రాత్రి గడిపితే వారి బాధ మీకు అర్థమవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విపక్షాలకు సవాల్ విసిరారు. వారం రోజులైనా అక్కడి జనంతో కలిసి బతుకడానికి సిద్ధమే అని హరీశ్‌రావు సవాల్‌కు సిద్ధపడ్డారు. ఇక తప్పదన్నట్టు పేదలకు డబుల్ బెడ్‌రూమ్ పథకం కింద కట్టి ఉన్న ఇళ్లను వారిలో కొందరికి కేటాయించారు. 'మూసీ పునరుజ్జీవం' అనే మాట కాంగ్రెస్ ప్రభుత్వం మెదడులో తెలివిగా వచ్చిన ఆలోచన. ఎన్నికల హామీల నాడు ఆ ఊసు లేదు. రాష్ట్రం అప్పుల కుప్ప అయిందనే సాకుతో పెంచి ఇస్తామన్న సంక్షేమ పథకాలను మరిచిపోయింది. ప్రజల్లో పెరుగుతున్న అసహనం నుంచి దృష్టి మళ్లించేందుకు తెరపైకి హైడ్రాను తెచ్చింది. అది ఏడాది కాలంలో చేసిన హంగామాలో ప్రజలకు జరిగిన నష్టమే ఎక్కువ. తమ పని ప్రదేశాలకు దూరంగా వెళ్లలేమని చాలామంది కొత్త చోట్లకు వెళ్లడానికి నిరాకరించారు. నిరాశ్రయులు కాబోయే స్థితిలోకి వెళ్లిన ఆ పేద ప్రజలు ప్రస్తుతానికి తమ ఇండ్లలోనే బతుకుతున్నారు. అంతా రసాభాసగా మధ్యనే ఆగిపోయిన మూసీ పునరుజ్జీవం మళ్లీ ముందుకు వచ్చింది. దీనితో ముడిపడి ఉన్న సమస్యలేవీ దారిలోకి రాకముందే మూసీ కొత్త అందాల ప్రాజెక్టుకు ప్రభుత్వం ఇటీవల కొబ్బరికాయ కొట్టింది. మూసీ నది చుట్టుపక్కల ఎలాంటి మార్పులు తేవాలో తెలుసుకునేందుకు మంత్రుల, అధికారుల బృందం జనవరిలో సింగపూర్ వెళ్లి వచ్చారు. అక్కడ నది పక్కన అభివృద్ధి చెందిన పార్క్‌లు, వ్యాపార కేంద్రాలు చూసి వచ్చారు. లక్షా ముప్పై వేల కోట్ల రూపాయల ప్రణాళికతో మూసీ పునరుజ్జీవం ప్రభుత్వం చేపడుతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హామీ ఇచ్చిన పథకాలకే డబ్బులు లేవని, అప్పులు పుట్టడం లేదంటున్న ప్రభుత్వం ఇంత భారీ ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తుంది, దానికోసం ప్రజలపై మళ్లీ కొత్త పన్నుల భారం మోపడం అవసరమా అని విపక్షాల నుంచి విమర్శ వచ్చింది. వెంటనే మాట మార్చిన రేవంత్‌రెడ్డి ఆ ప్రాజెక్టుకు ప్రభుత్వం లక్ష కోట్లు ఖర్చు పెడుతుందని అనలేదన్నారు. ఆ మొత్తంలో చాలా మట్టుకు ప్రైవేటు భాగస్వామ్యం కూడా ఉంటుందని సవరించారు. మూసీ ప్రక్షాళనలో పెట్టుబడికి, నిర్వహణకు సింగపూర్ ప్రభుత్వంతో కొన్ని ఒప్పందాలు అయినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. మూడురోజుల కిందట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'గోదావరి తాగునీటి పథకంలోని రెండు దశలకు, మూసీ నది పునరుజ్జీవనం' కోసం గండిపేట వద్ద శంకుస్థాపన చేశారు. దీనికోసం మల్లన్నసాగర్ రిజర్వాయ ర్ నుంచి 20 టీఎంసీల నీటిని తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయం ప్రభుత్వం పత్రికలకు ఇచ్చిన ప్రకటనల్లో, వార్తల్లో స్పష్టంగా ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటి నిల్వకు వీల్లేదని ఇంతకాల ం చెప్తున్న ప్రభుత్వం అదే కాళేశ్వరం ఆధారంగా నిర్మించిన మల్లన్నసాగర్ నుంచి నగరానికి నీటి మళ్లింపు పథకానికి శంకుస్థాపన జరిపింది. ఒకవైపు కాళేశ్వరంపై సీబీఐ విచారణ కోరుతున్న సమయంలో అదే ప్రాజెక్టులో భాగమైన మల్లన్నసాగర్ నుంచి నీటి వాడకంపై బీఆర్ఎస్ నేతలు వేసిన ప్రశ్నలు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాయి. గండిపేటకు తెస్తున్నది కాళేశ్వరం నీళ్లా.. కాదా.. అనేది ముఖ్యమంత్రి చెప్పాలని కేటీఆర్‌డిమాండ్ చేశారు. దీంతో రేవంత్‌రెడ్డి మాట మార్చారు. గోదావరి జలాలు నగరానికి వస్తున్నాయంటే శ్రీపాదరావు ఎల్లంపల్లి ప్రాజెక్టే మూల మని కొత్త పాట ఎత్తుకున్నారు. ఆ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్మించింద న్నారు. కాంగ్రెస్ హయాంలో పునాదిరాయి పడిన ఆ ప్రాజెక్టుపై కేసీఆర్ ప్రభుత్వం రూ.2,052 కోట్లు ఖర్చుచేసి 2016లో పూర్తి చేసిందని హరీశ్‌రావు తెలిపారు. అంతేకాకుండా మల్లన్నసాగర్ 2008లో వైఎస్ రాజశేఖరరెడ్డి మొదలుపెట్టినదే అని రేవంత్ అన్నారు. ఈ మాటలు కూడా వివాదాలకు తావిచ్చాయి. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసంధానమైన మల్లన్నసాగర్‌కు వచ్చే నీళ్లు కేవలం ఎల్లంపల్లివి అనడం సాంకేతికంగా తప్పే అవుతుంది. మేడిగడ్డలో నీళ్లు నిల్వ చేస్తే కట్ట తెగి కింది గ్రామాలు కొట్టుకుపోతాయని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పదే పదే అనేవారు. పంటలు ఎండిపోతు న్నాయని రైతులు ఆందోళన చేయడంతో నీళ్లు వదలక తప్పలేదు. వచ్చే వానకాలం నాటికీ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను రక్షించుకొని, వాటి నీటిని వినియోగించు కునేలా చర్యలు చేపట్టవలసిన అవసరం ఉన్నదని మంత్రి ఇటీవల అన్నారు. ఎంత వద్దనుకున్నా కాళేశ్వరం నీళ్లు వాడక తప్పని పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు తొలి అడుగు అయిన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీలోని 85 పిల్లర్లలో రెండు మాత్రమే పాక్షికంగా దెబ్బ తిన్నట్టు నివేదిక స్పష్టం చేసింది. ఇప్పుడు కూడా వరదలకు తట్టుకొని ఆ బ్యారేజీ వంద టీఎంసీల నీటి నిల్వతో ఉందని, ఆ నీళ్లతో రంగనాయకసాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లలో ఎత్తిపోతలు జరుగుతు న్నాయని, చుట్టూ గ్రామాల్లో పంటలు పండుతున్నాయని ఇటీవల ఆ ప్రాంతాలను పర్యటించిన బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు.



# గజ్వేల్ లో ఒకే కాలనీకి ఆరు పేర్లు




**- వీధి మొదట్లో రాత్రికి రాత్రే వెలిసిన నేమ్ బోర్డులు..**

**- ఉన్నదే 25 ఇళ్లు.. కానీ కాలనీకి మాత్రం ఆరు పేర్లు..!**


**- నాడు వినాయక నగర్.. నేడు కులానికి ఓ పేరు..?**

**గజ్వేల్,తెలంగాణ దిశ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఓ కాలనీలో రాత్రికి రాత్రే కొత్త నేమ్‌బోర్డులు వెలిశాయి. కాలనీలో ఉన్నదే 25 ఇళ్లు.. కానీ కులా నికో పేరు చొప్పున కాలనీ మొదట్లో ఆరు నేమ్ బోర్డులను ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల జరిగిన ఓ వివాదం నేపథ్యంలో కుల విభేదాలు పొడసూపడమే దీనికి కారణమని తెలుస్తోంది.

మొదటి నుంచీ 'వినాయకనగర్' అని పిలుస్తున్న ఆ కాలనీని ప్రస్తుతం ఎవరి కులాన్ని బట్టి వారు ప్రత్యేకంగా పేరు పెట్టుకున్నారు. గజ్వేల్ పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సమీపంలో ముట్రాజ్‌పల్లి రోడ్డు పక్కన వినాయక నగర్ కాలనీ ఉంది. ఇక్కడి కుటుంబాలలో 70 శాతం ఒకే సామాజికవర్గం కాగా మిగతా 30 శాతం వివిధ సామాజిక వర్గాల వారు ఉన్నారు.

కాలనీ ఏర్పాటైన కొత్తలో 'వినాయక నగర్' అని నామకరణం చేసుకున్నారు. అయితే, ఇటీవల జరిగిన ఓ గొడవతో కాలనీలో కుల విభేదాలు పొడసూపాయి. దీంతో మెజార్టీ సామాజిక వర్గం ఈ కాలనీకి తమ కులం పేరుతో నేమ్ బోర్డు ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై మిగతా కులాల వారు అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. దీంతో మిగతా కులాల కుటుంబాలు కూడా తమ కులాల పేర్లతో రెడ్డి ఎన్ క్లేవ్, ఆర్యవైశ్య ఎన్ క్లేవ్, ముదిరాజ్ ఎన్ క్లేవ్,విశ్వకర్మ ఎన్ క్లేవ్, యాదవ్స్ ఎన్ క్లేవ్ పేర్లతో నేమ్ బోర్డులు ఏర్పాటు చేసుకున్నారు.

# ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి షురూ!



**విజయవాడ,తెలంగాణ దిశ :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి ప్రారంభం అయింది. పాలకవర్గాల పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. మొత్తం నాలుగు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని వచ్చే ఏడాది మార్చిలో పదవీ విరమణ చేయనున్నారు.

ఈ లోపే స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేసి పదవీ విరమణ చేయాలన్న ఆలోచనతో ఉన్నారు. అయితే అధికార పార్టీలో సన్నాహాలు ప్రారంభం అయ్యాయి కానీ.. ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి కదలిక లేదు. కేంద్ర బలగాల సాయంతోనే ఎన్నికలు నిర్వహిస్తేనే అన్నమాట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వినిపిస్తోంది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను ఎలా తీసుకుంటుందో అర్థమవుతోంది. గత అనుభవాల దృష్ట్యా స్థానిక సంస్థల విషయంలో జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎన్నో రకాల ట్విస్టులు కొనసాగాయి.

చంద్రబాబు హయాంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా నియమితులయ్యారు నిమ్మగడ్డ రమేష్ కుమార్. అదే సమయంలో కరోనా వచ్చింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో తన ఆదేశాలు పాటించలేదని.. నిమ్మగడ్డ రమేష్ కుమార్ చంద్రబాబు మనిషి అంటూ తప్పించే ప్రయత్నం చేశారు జగన్మోహన్ రెడ్డి. కానీ చివరకు కోర్టు ఆదేశాలతో నియమితులయ్యారు నిమ్మగడ్డ. ఆయన కమిషనర్ గా ఉండగానే స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగాయి. అయితే ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా నీలం సాహ్ని ఉన్నారు.

ఆమె జగన్ హయాంలో నియమితులయ్యారు. కానీ ఇప్పుడు ఆమె ఎన్నికల నిర్వహణకు ప్రతిపాదనలు పెడితే ప్రభుత్వం నుంచి ఆమోదముద్ర వచ్చింది. ఇప్పటికే ఆమె నేతృత్వంలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికలు జరిగాయి. ఆమెపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి రకరకాల ఒత్తిడిలు వెళ్లాయి. కానీ ఆమె పెద్దగా చలించలేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఏ స్థాయిలో? ఎలా జరుగుతాయో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అర్థమయింది. అందుకే ఎన్నికలను బహిష్కరిం చేందుకు ఆ పార్టీ ఇప్పటినుంచే కారణాలను వెతుక్కుంటుందివైయ స్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఇప్పుడే ఆ పార్టీలో ఆశావహులు ముందుకు వచ్చే అవకాశం లేదు.కనీసం పార్టీ పిలుపు ఇస్తున్న కార్యక్రమాలకు సైతం పార్టీ శ్రేణులు హాజరవుతున్న దాఖలాలు లేవు. పులివెందులతో పాటు ఒంటిమిట్టలో వచ్చిన ఫలితం పార్టీ శ్రేణులకు తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. గతంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంతో పాటు జాతీయస్థాయి లో అధికారంలో ఉన్నప్పుడే.. ఉప ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. అటువంటిది ఇప్పుడు ఈ రెండు జెడ్పిటిసి ఎన్నికల్లో ఓడిపోవడం అనేది ఆ పార్టీకి చాలా నష్టమే. పార్టీలో ఒక అపనమ్మకాన్ని, నైరాశ్యాన్ని అలుముకునేలా చేసింది ఈఫలితం. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను బాయ్ కట్ చేసేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. దానికి కారణాలు చెప్పుకునేందుకే.. కేంద్ర బలగాలతో ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు అధి కారిక నోటిఫికేషన్ వచ్చిన తర్వాత.. ఒక పద్ధతి ప్రకారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన నిర్ణయాన్ని వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# ఆదిమూలానికి ఏమైంది?

**ఒంగోలు,తెలంగాణ దిశ :** వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు మంత్రిగా పనిచేసిన ఆదిమూలపు సురేష్ అధికారం కోల్పోయిన తర్వాత మాత్రం యాక్టివ్ గా ఉండటం లేదు. ఆదిమూలపు సురేష్ వైసీపీ హయాంలోని ఐదేళ్లలో కొన్నాళ్లు విద్యాశాఖ మంత్రిగానూ, మరికొన్నాళ్ల పాటు మున్సిపల్ శాఖ మంత్రిగానూ ఉన్నారు. అయితే ఆయన ప్రభుత్వం మారిన తర్వాత తాను ప్రాతినిధ్యం వహించిన శాఖలకు సంబంధించిన విమర్శలు అధికార పార్టీ నుంచి వచ్చినప్పటికీ ఆయన స్పందిచడం లేదు. పైగా ప్రస్తుతం యర్రగొండపాలెంలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యేకు ఇబ్బందికరంగా మారారంటున్నారు. అక్కడ వైసీపీ ఎమ్మెల్యేపై తన అనుచరులతో సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఆదిమూలపు సురేష్ 2009, 2014, 2019, 2024 లలో జరిగిన ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో పోటీ చేశారు. నాలుగు సార్లు పోటీ చేసి మూడు సార్లు విజయం సాధించారు.ఆదిమూలపు సురేష్ దక్షిణ మధ్య రైల్వేలో ఐఆర్ఎస్ అధికారిగా పనిచేశారు. తర్వాత వీఆర్ఎస్ తీసుకుని రాజకీయాల్లోకి వచ్చారు. 2009 లో కాంగ్రెస్ తరుపున యర్రగొండపాలెం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే ఆయనకు యర్రగొండపాలెం అంటేనే ఎక్కువ మక్కువ. అక్కడే తన రాజకీయాలను కొనసాగించాలని గట్టిగా అనుకుంటున్నారు. అయితే 2024 ఎన్నికల్లో ఆయనను యర్రగొండపాలెం నుంచి తప్పించి కొండపి నియోజకవర్గం నుంచి పోటీ చేయించారు. అక్కడ ఓటమితో ఇక కొండపి నియోజకర్గం నుంచి క్యాడర్ కు కూడా దూరంగా ఉన్నారు. 2009లో యర్రగొండపాలెం నుంచి పోటీచేసిన ఆదిమూలపు సురేష్ తొలిసారి గెలిచారు. అయితే వైఎస్ మరణం తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన జగన్ తో కలసి ప్రయాణం చేయాలని నిర్ణయించారు. జగన్ 2014 ఎన్నికల్లో ఆదిమూలపు సురేష్ ను సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేయించారు. అప్పుడు అధికారంలోకి రాలేదు. 2019 ఎన్నికలకు వచ్చేసరికి సంతనూతలపాడు నుంచి ఆదిమూలపు సురేష్ ను మళ్లీ యర్రగొండపాలెంకు జగన్ పంపించి అక్కడి నుంచి పోటీ చేయించారు. అక్కడి నుంచి విజయం సాధించారు. జగన్ తొలి కేబినెట్ లో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు.



రెండున్నరేళ్ల తర్వాత జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఆదిమూలపు సురేష్ ను జగన్ కేబినెట్ లో కొనసాగించారు. అయితే ఈసారి విద్యాశాఖ కాకుండా మున్సిపల్ శాఖకు మార్చారు. ఆదిమూలపు సురేష్ కారణంగానే తన సొంత బంధువును బాలినేనిని కూడా జగన్ పక్కన పెట్టారు.జగన్ సొంత జిల్లా అయిన కడపకు ఆయనను ఇన్‌ఛార్జి మంత్రిగానూ నియమించారు. అంత నమ్మకాన్ని జగన్ సురేష్ పై ఉంచారు. కానీ అధికారం కోల్పోయిన తర్వాత మాత్రం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. తనను యర్రగొండపాలెం నుంచి కొండపి పంపించడంపై ఆయన కొంత ఇబ్బంది ఫీలవుతున్నారు. 2024 ఎన్నికల్లో యర్రగొండపాలెం నుంచి తాటిపర్తి చంద్రశేఖర్ వైసీపీ నుంచి గెలవడంతో అక్కడకు కూడా వెళ్లలేక హైదరాబాద్ కే ఆదిమూలపు సురేష్ పరిమితమయ్యారంటున్నా రు. అయితే తనకు బలమైన అనుచరులు, క్యాడర్ ఉన్న యర్రగొండ పాలెంలో ఆదిమూలపు సురేష్ వేలు పెడుతుండటం, స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వర్గాన్ని తయారు చేయడంతో పార్టీ నాయకత్వం కూడా సీరియస్ కావడంతో ఇక ఏపీ రాజకీయాలకు ఆదిమూలపు సురేష్ దూరంగా ఉన్నారని తెలిసింది. ఐదేళ్లు మంత్రి పదవి ఇచ్చినా జగన్ కు కష్టకాలంలో మాత్రం దూరంగా ఉండిపోయిన ఆదిమూలపు సురేష్ పై వైసీపీ సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నారు.

# మళ్లీ దగ్గరవుతున్నా జవహార్..!

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ, అందులో తెలుగుదేశం పార్టీలో మాజీ మంత్రి కేఎస్ జవహర్ మళ్లీ అధిష్టానానికి దగ్గర య్యారు. ఆయన వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కోసం ఇప్పటి నుంచే తన ప్రయత్నాలు మొదలు పెట్టినట్లుంది. కేఎస్ జవహర్ కు 2024 లో జరిగిన ఎన్నికల్లో టిక్కెట్ దక్కలేదు. ఆయన 2014లో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఉపాధ్యాయ వృత్తి చేస్తూ రాజకీయాల్లోకి వచ్చిన జగన్ వచ్చిన వెంటనే ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడమే కాకుండా మంత్రి పదవి కూడా వరించింది. అయితే కొవ్వూరు నియోజకవర్గంలోని టీడీపీ నేతలతో పొసగక పోవడంతో ఆయన రాజకీయ జీవితంలో స్పీడ్ కు కొంత ఫుల్ స్టాప్ పడినట్లయిందన్నది వాస్తవం. కొవ్వూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కె. జవహర్ ను అక్కడి నేతలు వ్యతిరేకించడంతో 2019 ఎన్నికలలో ఆయనను తిరువూరుకు చంద్రబాబు పంపించారు. అయితే అక్కడ ఆయన వైసీపీ అభ్యర్థి రక్షణ నిధి చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే తిరువూరు మొన్నటి ఎన్నికల్లో కొలికపూడి శ్రీనివాసరావుకు కేటాయించారు. అమరావతి ఉద్యమంలో పాల్గొన్న కొలికపూడికి టిక్కెట్ ఇవ్వడంతో ఆయన అక్కడ ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే తిరువూరు లో కొలికపూడికి, అక్కడి పార్టీ నేతలకు, క్యాడర్ కు పడకపోవడం, అనేక వివాదాలు చోటు చేసుకుంటుండటంతో జవహర్ చూపు తిరిగి తిరువూరు పై పడిందని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో జవహర్ తిరువూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి



అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకుంటు న్నారు. కొవ్వూరు కంటే ఆయనకు తిరువూరు పైనే ప్రస్తుతం దృష్టి ఉన్నట్లు కనపడుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత చంద్రబాబు భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల్లో జవహర్ కు కీలకమైన పోస్టు లభించింది. ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమితులయ్యారు

# యూరియా కష్టాలకు కారణం ఎవరు?




యూరియా కొరత లేదని రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు చెబుతుంటే, రైతుల క్యూలు మాత్రం రాష్ట్రమంతటా వ్యాపిస్తున్నాయి. ముఖ్యమంత్రి అడిగిందే తడవుగా టన్నుల కొద్దీ యూరియాను వ్యాగిన్లకు నింపి కేంద్రం పంపిందని ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు కూడా యూరియా రైతుల కష్టాల గురించి రాయక తప్పడంలేదు. ఎరువుల కొరత అనేది గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతున్నది. ఇలా ఎందుకు జరుగుతున్నది? దీనికి కారణాలు ఏమిటి, కారకులు ఎవరు?

దేశంలో 1957లో ఎరువుల కంట్రోల్ ఆర్డర్ ఏర్పడింది. ఆ తర్వాత 1985లో ఈ చట్టాన్ని సవరించి మరింత బలపరిచారు. దీని ద్వారా పంటలకు అవసరమైన ఎరువులను ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా ఉత్పత్తి చేయడంతో పాటు, ప్రైవేటు కంపెనీల నుండి ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు సబ్సిడీ ఇచ్చే విధానం వుండేది. అయితే 1990 తర్వాత వచ్చిన నూతన ఆర్థిక విధానాలు ఈ పద్ధతికి తిలోదకాలు ఇచ్చాయి. రిటెన్షన్ ప్రైస్ సిస్టమ్ ద్వారా కంపెనీల ఉత్పత్తి ఖర్చును లెక్కించి రైతులకు భారం పడకుండా అవసరమైన సబ్సిడీని ప్రభుత్వాలు భరించే పద్ధతిని పూర్తిగా మార్చి వేస్తూ ప్రస్తుత బిజెపి ప్రభుత్వం 2025లో సవరించింది. దీని వల్ల యూరియా, ఇతర ఎరువుల కొరత దేశవ్యాప్తంగా పెరుగుతుంది. అయితే అత్యధిక రాష్ట్రాలు బిజెపి ఏలుబడిలో వున్నాయి కనుక డిమాండ్ కు తగ్గట్టుగా ఆ రాష్ట్రాలకు సరఫరా చేసి మన లాంటి రాష్ట్రాలను ఎండబెడుతు న్నారు. ఎరువులను సబ్సిడీకి అందించకుండా ఆహార భద్రతను సాధించలేము. రైతు ఉద్యమాల ఫలితంగా కొన్ని చట్టాలు అమలులోకి వచ్చాయి. అయితే కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తున్న బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఈ కంపెనీలకు అప్పగించడానికి అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నది. వ్యవసాయ నల్ల చట్టాలతో పాటు, రైతులకు కొద్ది మేరకైనా రక్షణగా వున్న ధరల నియంత్రణ కమిషన్, ఎరువుల కంట్రోల్ ఆర్డర్ లాంటి వాటిని మార్చివేస్తున్నారు. 1992 నుండి ఫాస్పేట్ ఎరువులపై కంట్రోల్ ఎత్తివేయటం మొదలు పెట్టారు. యూరియాపై నియంత్రణను ఒకేసారి ఎత్తివేస్తే రైతుల్లో వ్యతిరేకత వస్తుందనే భయంతో దొడ్డిదారిన కోత వేస్తున్నారు. రామగుండం లాంటి అనేక ప్రభుత్వ రంగ ఎరువుల పరిశ్రమలను మూసివేసి విదేశాల నుండి దిగుమతులు చేసుకోవడం విధానంగా మారింది. ఏ కంపెనీ ఏ దేశం నుండి దిగుమతి చేసుకోవాలో కేంద్రం నిర్ణయించే విధానం అమలులోకి వచ్చింది. 2010లో ప్రవేశపెట్టిన న్యూట్రియంట్ ఆధారిత సబ్సిడీ (యన్.బి.ఎస్) స్కీము కూడా నష్టం తెచ్చింది. యన్.బి.ఎస్ స్కీమ్‌లో యూరియాను మినహాయించారు. మిగిలిన ఎరువులపై కంట్రోల్ పూర్తిగా ఎత్తివేశారు.

దీంతో మార్కెట్ డిమాండ్‌ను బట్టి ఎరువుల ధరలు భారీగా పెంచి కంపెనీలు లాభపడుతుంటే, రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. సరసమైన ధరలకు మాత్రమే ఎరువులను అమ్మాలని ఉత్పత్తిదారులకు ప్రభుత్వాలు చేస్తున్న విజ్ఞప్తులు మొసలి కన్నీరు లాంటివి. సరసమైన ధర అంటే ఏమిటో 2015లో ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వలేదని కాగ్ (కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా) చెప్పింది. ఉత్పత్తి ఖర్చుపై 12 శాతానికి మించకుండా లాభాలు ఉండాలని 2019లో ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఉత్పత్తి ఖర్చు ఎంత అనే వివరాలు ఉత్పత్తిదారుల దగ్గర అందుబాటులో లేవనీ కాగ్ చెప్పింది. ఎరువుల ఉత్పత్తి కంపెనీలు తమ ఇష్టారీతిన ఎం.ఆర్.పి ధరలు నిర్ణయించుకుంటున్నాయి. కంపెనీలు ఎంత శాతం లాభాలు వేసుకుంటున్నాయో లెక్కాపత్రం లేకుండా పోయిందని కాగ్ చెప్పింది. ఎరువులపై కంట్రోల్ ఎత్తివేయడంతో 2010లో పొటాష్ టన్ను ధర రూ.4,455 ఉంటే 2023లో రూ.34,644 ప్రస్తుతం 30 వేలకు పైనే ధర ఉంది. డై అమోనియం ఫాస్పేట్ (డి.ఏ.పి) 2017లో రూ.9,350 ఉండే, 2023లో రూ.27,000 వుండగా ప్రస్తుతం రూ.60 వేలకు పైగా టన్ను ధర ఉంది. యూరియాను మాత్రం న్యూట్రియెంట్ ఆధారిత సబ్సిడీ కింద చేర్చలేదు. కాబట్టి యూరియాపై ప్రభుత్వాలు సబ్సిడీని కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతం యూరియా 45 కేజీల బస్తా రూ.266.50గా నిర్ణయించారు. దీంతో యూరియాకు సబ్సిడీ ఉండటం వల్ల తక్కువ ధరకు రైతులకు అందుబాటులో ఉంది. డి.ఏ.పి, పొటాష్, ఫాస్పేట్ తదితర ఎరువుల ధరలు విపరీతంగా పెరగటం, యూరియా ధర తక్కువగా ఉండటంతో రైతులు యూరియా వాడకం పెంచారు. దేశీయ డిమాండ్‌కు అనుగుణంగా యూరియా ఉత్పత్తి చేయకుండా విదేశాల నుండి దిగుమతి చేసుకోవడంతో కొరత పెరిగి ధర భారీగా పెంచి కంపెనీలు, వ్యాపారసంస్థలు లాభపడుతు న్నాయి. ఈ మూడు దశాబ్దాల్లో దేశీయ ఉత్పత్తి బాగా పడిపోతూ వచ్చింది. ప్రత్యేకించి డి.ఏ.పి 60 శాతం, ఎం.ఓ.పి 100 శాతం విదేశాల మీద ఆధారపడి వుంది. ప్రపంచ ఎరువుల ఉత్పత్తిలో 84 శాతం ఎం.ఓ.పిని ఏడు కంపెనీలు నియంత్రిస్తున్నాయి.

10 పెద్ద ఎరువుల కంపెనీలు 38 శాతం ఎరువుల అమ్మకాలు జరుపుతున్నాయి. కంపెనీల ను నియంత్రించే శక్తి ప్రభుత్వాలకు లేకుండా పోయింది. ముడి పదార్థాల ధరలు పెరగటం, రూపాయి విలువ తగ్గటం, అంతర్జాతీయ మార్కెట్ ధరల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థ మీద, ముఖ్యంగా రైతాంగం మీద చాలా తీవ్రంగా పడింది. గత నాలుగు సంవత్సరాలుగా ఎరువుల కొరత గురించి పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ పూర్వకమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. 2020లో అవసరమైన ఎరువులలో 40 శాతం తక్కువగా రైతులకు ఇచ్చారు. క్రమంగా ఆ కొరత 68 శాతానికి పెరిగింది. యూరియా కొరత మరింత పెద్ద సమస్యగా తయారైంది. కరోనా అనంతరం 2020 మార్చి గణాంకాలను 2019తో పోలిస్తే 15 శాతం తక్కువగా యూరియా మార్కెట్‌లోకి వచ్చింది. 2020 డిసెంబర్ 20 నాటికి 52 శాతం కొరత ఏర్పడింది. ఫలితంగా రైతులు ఎరువులను బ్లాక్ మార్కెట్లో కొనుక్కోవాల్సి వచ్చింది. ఇచ్చే అరకొర ఎరువులకు కూడా అధార్ లింక్ పెట్టారు. దీనివల్ల కౌలు రైతులపై మరింత అదనపు భారం పడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని చెప్పే మాటలు ఎండమావుల్లా మారుతున్నాయి. ఎన్నికల ముందు కౌలు రైతులను ఆదుకుంటామన్న మన ముఖ్యమంత్రి రానున్న రబీలో ఎరువులను ఆధార్‌తో, ఈ క్రాప్‌తో లింక్ చేసి రైతులకు అమ్ముతామని ప్రకటించారు. దీంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతారు.

గత సంవత్సరం ఆగస్టు నాటితో పోలిస్తే ఈ సంవత్సరం యూరియా నిల్వలు 49 శాతం తక్కువగా ఉన్నాయి. డి.ఏ.పి, కాంప్లెక్స్, పొటాష్ నిల్వలు కూడా తక్కువగానే ఉన్నాయి. ప్రభుత్వ ప్రకటనలు, మంత్రుల సవాళ్ళు చూస్తుంటే వాస్తవ పరిస్థితుల నుండి రైతులను ఆదుకోవాలనే చిత్తశుద్ధి కంటే సమస్యను పక్కదారి పట్టించి రాజకీయ నష్ట నివారణకు ప్రయత్నిస్తున్నట్లుగా వుంది. ఎరువుల సమస్యకు మూలమైన కేంద్ర ప్రభుత్వ విధానాల గురించి వైసిపి ఒక్క మాట మాట్లాడకుండా వీధుల్లో ఆందోళన చేస్తుంది. నానో యూరియా, బయో ఫెర్టిలైజర్, ఆర్గానిక్ ఫార్మింగ్ వాడి ఆరోగ్యాన్ని కాపాడుకొమ్మని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. ప్రభుత్వ విధానం వెనుక వున్న ఉద్దేశాన్ని గుర్తించకుండా కొద్దిమంది మేధావులు గుడ్డిగా బలపరుస్తున్నారు. భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'ఇఫ్కో' ఈ సంవత్సరం 1,224.36 లక్షల నానో యూరియా బాటిళ్లను 500 మిల్లీలీటర్ల పరిమాణంలో తయారు చేసింది. ఇప్పటికి 993.61 లక్షల బాటిళ్లను అమ్మారు. 45 కిలోల బరువుగల సాధారణ యూరియాకు ప్రభుత్వం సుమారుగా రూ.2,400 నుండి రూ.2,600 వరకు సబ్సిడీ భరించాల్సి వస్తుంది. నానో యూరియాకు సబ్సిడీ ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉండదు. రైతులను మార్కెట్ కంపెనీలకు బలిచ్చే ఈ విధానం అమలులో భాగమే నేడు యూరియా కొరతకు మూల కారణం. కేంద్రం నుండి రాష్ట్రాలకు ఇచ్చే యూరియా కోటాను తగ్గించుకుంటే ఆ వ్యత్యాసం సబ్సిడీ డబ్బును ఆ యా రాష్ట్రాలకు గ్రాంటుగా ఇస్తామని కేంద్రం చెప్పి అన్ని రాష్ట్రాలకు పది శాతం యూరియా సరఫరాకు కోత కోసింది. మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 25 శాతం తగ్గించుకుని ఆ వ్యత్యాసం డబ్బును తన ఖజానాలో వేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. రైతుల ప్రాణాలతో పాలకులు చెలగాటం ఆడుతున్నారు. దీనికి వ్యతిరేకంగా రైతులు, కౌలుదారులు ఉద్యమాలకు సిద్ధంకావాలి.

# ప్రొటీన్ లోపం ఆరోగ్యానికి ఎంత హానికరమో తెలుసా..?



ప్రొటీన్ అనేది అత్యంత ముఖ్యమైన స్థూల పోషకం. ప్రోటీన్ కేవలం కండరాల నిర్మాణానికి మాత్రమే తోడ్పడదు.

శరీరంలోని ప్రతి కణం, కణజాలం, అవయవాల పనితీరుకు అవసరం. హార్మోన్లు, ఎంజైమ్‌లు, రోగనిరోధక కణాలు, రవాణా ప్రొటీన్ల ఉత్పత్తిలో ప్రొటీన్ కీలకపాత్ర పోషిస్తుంది. రోజువారీ ఆహారంలో మనం తగినంత ప్రొటీన్ తీసుకోనప్పుడు మన శరీరం వివిధ రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటుంది. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**కండరాల బలహీనత:** ఈ కండరాల బలహీనత అనేది ప్రోటీన్ లోపానికి అత్యంత స్పష్టమైన సంకేతం. శరీరానికి తగినంత ప్రొటీన్ అందనప్పుడు అది తన కండర కణజాలాలను విచ్ఛిన్నం చేసి అవసరమైన అమైనోఆమ్లాలను పొందుతుంది. దీనివల్ల కండరాల బలం తగ్గి.. బలహీనత, అలసట, రోజువారీ పనులు చేయడంలో ఇబ్బంది లాంటి సమస్యలు కలుగుతాయి. వ్యాయామం చేసినా కండరాలు పెరగకపోవడాన్ని, క్షీణించడాన్ని గమనించవచ్చు.

**రోగనిరోధక వ్యవస్థ బలహీనం:**
మన రోగనిరోధక వ్యవస్థలోని కణాలు, ముఖ్యంగా యాంటీబాడీస్ ప్రొటీన్‌తో తయారవుతాయి. కాబట్టి ప్రొటీన్ లోపం రోగనిరోధక శక్తిని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. దానివల్ల శరీరం ఇన్ఫెక్షన్లు, జలుబు, ఫ్లూ తదితర వ్యాధులకు గురవుతుంది. కోలుకోవడానికి ఎక్కువ సమయం పట్టడం, తరచుగా అనారోగ్యాల బారిన పడటం లాంటివి సంభవిస్తాయి.

**జుట్టు సమస్యలు:**
జుట్టు ప్రధానంగా ప్రొటీన్ (కెరాటిన్) తో తయా రవుతుంది. ప్రొటీన్ లోపంవల్ల జుట్టు సన్నబడటం, పొడిబారడం, బలహీనపడటం,విపరీతంగా రాలిపోవడంలాంటి సమస్యలు వస్తాయి. కొన్నిసార్లు జుట్టు రంగు కూడా మారపోయే అవకాశం ఉంది.

**చర్మ సమస్యలు:** ప్రొటీన్ లోపం చర్మ సమస్యలకు కూడా దారి తీస్తుంది. కొల్లాజెన్, ఎలాస్టిన్ అనే ప్రోటీన్లు చర్మం స్థితిస్థాపకతకు, ఆరోగ్యానికి అవసరం. ఈ కొల్లాజెన్, ఎలాస్టిన్ లోపంతో చర్మ సంబంధ సమస్యలు వస్తాయి. చర్మం పొడిగా, పొలుసులుగా మారుతుంది. అదేవిధంగా చర్మంపై పగుళ్లు కూడా వచ్చే ప్రమాదం ఉంది.

**గోర్లు పెలుసుబారడం:** చేతుల, కాళ్ల గోర్ల ఆరోగ్యానికి కూడా ప్రొటీన్ దోహదపడుతుంది. ప్రొటీన్ లోపంవల్ల గోర్లు పెలుసుగామారడం, సులభంగా విరిగిపోవడం, గోర్లపై గీతలు ఏర్పడటం లాంటి సమస్యలు వస్తాయి.

**ఎడీమా (వాపు):** ఎడీమా శరీరంలో ద్రవ సమతుల్యత లోపంవల్ల వస్తుంది. ప్రొటీన్‌లు రక్తంలో ప్లాస్మా ఆంకోటిక్ పీడనాన్ని నిర్వహించడంలో సాయపడతాయి. ఈ పీడనం రక్తనాళాల నుంచి కణజాలంలో కి ద్రవం లీక్ అవ్వకుండా నిరోధిస్తుంది. ప్రోటీన్ లోపంవల్ల ఈ పీడనం తగ్గుతుంది. ఫలితంగా ద్రవం కణజాలాలలో పేరుకుపోయి కాళ్లు, చీలమండలు, పాదాలు, చేతుల్లో వాపు వస్తుంది.

**బలహీన ఎముకలు:** ప్రొటీన్ ఎముకల ఆరోగ్యంలో కూడా కీలకపాత్ర పోషిస్తుంది. ఇది కాల్షియం శోషణ, ఎముకల సాంద్రతకు సాయపడుతుంది. తగినంత ప్రొటీన్ లేకపోతే ఎముకలు బలహీనపడి వాటిలో పగుళ్లు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది.

**బరువు పెరగడం:** ప్రొటీన్ శరీరానికి సంతృప్తిని పెంచుతుంది. ఆకలిని నియంత్రిస్తుంది. ప్రొటీన్ తక్కువగా ఉండే ఆహారం తీసుకున్నప్పుడు ఆకలి ఎక్కువగా ఉంటుంది. దాంతో అతిగా తింటాం. ఫలితంగా బరువు పెరిగే అవకాశం ఉంది.

**శక్తి హీనత:** ప్రొటీన్ శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తుంది. హిమోగ్లోబిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. ప్రొటీన్ లోపంవల్ల రక్తహీనత ఏర్పడి తీవ్రమైన అలసట, బలహీనత, తల తిరగడం లాంటి సమస్యలు సంభవిస్తాయి.

**ఎంత ప్రోటీన్ అవసరం..?:** ఒక సాధారణ ఆరోగ్యవంతుడైన వ్యక్తికి ప్రతి కిలో శరీర బరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. అయితే నిత్యం వ్యాయామం చేసేవారికి, గర్భిణీలకు, పాలిచ్చే తల్లులకు, వృద్ధులకు, కొన్ని అనారోగ్య సమస్యలతో ఉన్నవారికి ప్రొటీన్ అవసరం కొంత ఎక్కువగా ఉంటుంది.


**ప్రొటీన్ రిచ్ ఫుడ్స్:** మాంసం, చేపలు, గుడ్లు, పాలు, పెరుగు, చీజ్, పప్పులు, బీన్స్, చిక్కుళ్ళు, కాయధాన్యాలు, గింజలు లాంటి వాటిలో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది.

# గుండె బలహీన పడిందనేందుకు ప్రధాన సంకేతాలు



హృద్రోగ లక్షణాలంటే మనకు సాధారణంగా ఛాతిలో నొప్పే గుర్తుకు వస్తుంది. అయితే, ఆహారం అరగకపోవడం, దగ్గు, గాయాలు వంటివి కూడా ఛాతి నొప్పికి కారణంగా కావచ్చు. ఇక గుండె బలహీన పడిందనేందుకు ఇతర అనేక లక్షణాలు కూడా ఉన్నాయి. మరి అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయంటే అనుమానించాల్సిందే. గుండెకు రక్తప్రసరణ తగ్గినప్పుడు ఊపిరితిత్తుల్లో నీరు పేరుకుంటుంది. ఇలాంటప్పుడు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వస్తాయి. తగినంత రెస్టు తీసుకున్నా కూడా నీరసం వదలట్లేదంటే గుండె బలహీనపడిందని అర్థం. గుండె ద్వారా కండరాలు, ఇతర శరీర భాగాలకు ఆక్సిజనేటెడ్ రక్తం తగినంతగా సరఫరా కాకపోతే ఇలాంటి పరిస్థితి తలెత్తుతుంది. మెట్లు ఎక్కాలన్నా, బరువైన వస్తువులు మోసుకెళ్లాలన్నా ఇబ్బందులు ఎదురవుతాయి. ఎంత రెస్టు తీసుకున్నా నిత్యం నీరసం వేధిస్తోందంటే వెంటనే అప్రమత్తం కావాలని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో రక్తప్రసరణ సజావుగా సాగాలంటే గుండె ఆరోగ్యంగా ఉండాలి. గుండె బలహీనపడ్డ సందర్భాల్లో రక్తాన్ని ఇతర భాగాలకు పూర్తిస్థాయిలో పంప్ చేయలేదు. దీంతో, శరీర భాగాల్లో పలు చోట్ల నీరు (ఫ్లూయిడ్స్) పేరుకుంటుంది. దీన్ని వైద్య పరిభాషలో ఎడిమా అని అంటారు. కాళ్లు, మడమల్లో వాపునకు ఎడిమానే కారణం. ఒకే చోట కదలకుండా కూర్చొంటే ఈ వాపు మరింత ఎక్కువ అవుతుంది. ఎడిమా ఉన్నప్పుడు ఒక్కోసారి దిగువ శరీర భాగం మొత్తం బరువుగా అనిపిస్తుంది. గుండె చలనంలో మార్పులపై నిత్యం దృష్టి పెట్టిఉంచాలి. గుండెఆరోగ్యానికిఇది ప్రధాన సంకేతం. గుండె చలనంలో అసాధారణ మార్పులు (ఎరిథ్మియా), దడ ఎక్కువ గా వస్తుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. గుండె బలహీనప డ్డప్పుడు మెదడుకు కూడా రక్త సరఫరా తగ్గుతుంది. ఫలితంగా తలతిరగటం, స్పృహతప్పడం, నిత్యం మత్తుగా ఉండటం వంటి సమస్యలు మొదలవుతాయి. కాస్త శ్రమ పడ్డా కూడా శరీరం వణుకుతున్నట్టు అనిపిస్తుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే గుండె బలహీనపడుతున్నట్టుగా భావించాలని నిపుణులు చెబుతున్నారు. ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

# థైరాయిడ్‌ను నిర్లక్ష్యం చేయొద్దు




నేటి రోజుల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్లో థైరాయిడ్ ప్రధానమైంది. ఇది చాలా సున్నితమైన సమస్య. దీనిని నిర్లక్ష్యం చేస్తే అనేక కాంప్లికేషన్స్ ఎదురవుతాయి. అందుకే ముఖ్యంగా మహిళలు ఆరోగ్యం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. థైరాయిడ్ ఉన్నట్లుగా తెలిసిన తర్వాత డాక్టరు సూచనలు పాటించటం ముఖ్యం. మందుల వాడకం, తినే ఆహారం విషయంలోనూ కొన్ని జాగ్రత్తలు పాటించటం అత్యుత్తమం. అందుకే ఒత్తిడులకు దూరంగా ఉంటూ ప్రతిరోజూ కొంత సమయమైనా వ్యాయామానికి కేటాయించాలి. తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. థైరాయిడ్‌ను క్రమంగా తగ్గించుకోవచ్చు. శరీర జీవక్రియలన్నీ సక్రమంగా జరగాలంటే థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పని చేయాలి. థైరాయిడ్ గ్రంథి నుంచి విడుదలైన హార్మోన్లు రక్తప్రవాహంలో కలిసి చాలా కీలకమైన జీవక్రియలను నిర్వహిస్తుం టాయి. శ్వాసవ్యవస్థ, గుండె, నాడీ, జీర్ణవ్యవస్థ, సంతానోత్పత్తి వ్యవస్థ%శొ% ఇలా చాలా వాటిపై థైరాయిడ్ హార్మోన్ ప్రభావం ఉంటుంది. శరీరం శక్తిని వినియోగించుకునేందుకు, వెచ్చగా ఉండేందుకు, మెదడు, గుండె, కండరాలు, ఇతర అవయవాలు సక్రమంగా పని చేసేందుకు అవసరమైన హార్మోన్లను ఈ గ్రంథి ఉత్పత్తి చేస్తుంది. నిశ్చల జీవనశైలి, చెడు ఆహార అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, అయోడిన్ లోపం, ఆటో ఇమ్యూనిటీ కారణంగా థైరాయిడ్ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. థైరాయిడ్ సమస్య ఉంటే.. జీవక్రియలు సజావుగా జరగడానికి సరిపడ థైరాక్సిన్ హార్మోన్‌ను థైరాయిడ్ గ్రంథి ఉత్పత్తి చేయలేదు. హైపోథలామస్, పిట్యూటరీ, థైరాయిడ్ వ్యవస్థలలో మార్పులు రావడం వల్ల థైరాయిడ్ గ్రంథి పనితీరులో మార్పులు వచ్చి.. హైపర్ థైరాయిడిజమ్, హైపోథైరాయిడిజం వంటి సమస్యలు వస్తాయి. థైరాయిడ్ కారణంగా బరువు పెరగడం లేదా తగ్గడం, జుట్టు రాలడం, అలసట, నెలసరి సక్రమంగా రాకపోవడం, గర్భం దాల్చకపోవడం.. వంటి ఎన్నో సమస్యలు ఎదురవుతుంటాయి.

శరీర విధులపై ప్రభావం: థైరాయిడ్ గ్రంథి మెడ మధ్య స్వరపేటిక క్రింద భాగాన, కాలర్ ఎముక పైన సీతాకోక చిలుకను పోలిన ఆకారంలో ఉంటుంది. శరీరం పనితీరుకు అవసరమైన హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. ఈ గ్రంథి ద్వారా స్రవించే హార్మోన్ల కారణంగానే మానవ శరీరంలో జీవక్రియలు, అభివృద్ధి సక్రమంగా జరుగుతాయి. థైరాయిడ్ గ్రంథిలో ఏదైనా సమస్య ఏర్పడితే అది మొత్తం శరీర విధులను ప్రభావితం చేస్తుంది. థైరాయిడ్ వ్యాధి ఒక దీర్ఘ కాలిక సమస్య. ఈ వ్యాధితో బాధపడే వారు అనేక ఆరోగ్య సమస్యలను (హృదయ స్పందన రేటు, మానసిక స్థితి, శరీరంలో శక్తి స్థాయిలు, జీవక్రియలు, ఎముకల ఆరోగ్యం, గర్భధారణ, శరీర ఉష్ణోగ్రత, కొవ్వు నియంత్రణ) ఎదుర్కోవాల్సి ఉంటుంది. థైరాయిడ్ వ్యాధి అనేది లింగం, వయస్సుతో సంబంధం లేకుండా ఎవరికైనా రావొచ్చు. అయితే ఈ సమస్య మగవారి కంటే ఆడవారిలోనే దాదాపు రెండింతలు ఎక్కువగా కనిపిస్తుంది.

డిఎస్‌హెచ్‌తో నిర్ధారణ: థైరాయిడ్ గ్రంథి ముఖ్యంగా రెండు ప్రధాన హార్మోన్లను థైరాక్సిన్ (టి-4), ట్రైయోడోథైరోనిన్ (టి-3)ని తయారు చేస్తుంది. టి 3, టి 4 హార్మోన్లు అనేవి మన శరీరంలోని అవయవాల జీవక్రియలకు సంబంధించిన హార్మోన్లు. ఈ హార్మోన్లు శరీరంలోని ప్రతి కణాన్ని ప్రభావితం చేస్తాయి. టి3, టి 4 తయారీకి టిఎస్‌హెచ్ (థైరాయిడ్ స్టిములేటింగ్ హార్మోన్) అనేది అవసరం. ఎప్పుడైతే శరీరంలో టి 3,టి 4 తగ్గుతాయో, అప్పుడు వీటి ఉత్పత్తిని పెంచడానికి టిఎస్‌హెచ్ విడుదల అవుతుంది. ముఖ్యంగా థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ల స్థాయిని తెలుసుకోవడానికి టిఎస్‌హెచ్ పరీక్ష నిర్వహిస్తారు. టిఎస్‌హెచ్ సాధారణ స్థాయి పిఐయు/ ఎంల్ 0.35-5.50 సిఎల్ఐఎ వరకూ టిఎస్‌హెచ్ ఉంటుంది. 5.5 దాటితే టిఎస్‌హెచ్ స్థాయిని హైపోథైరాయిడ్‌గా పరిగణిస్తారు. అదేవిధంగా టిఎస్‌హెచ్ స్థాయి 0.4 ఎం యు/ ఎల్‌కంటే తక్కువగా ఉంటే హైపర్ థైరాయిడ్‌గా పరిగణిస్తారు. ఈ జాగ్రత్తలు తీసుకోవాలి: శరీరంలో థైరాయిడ్ హార్మోన్ అధికంగా ఉత్పత్తి అయినప్పుడు 'హైపర్ థైరాయిడిజం', అదేవిధంగా థైరాయిడ్ హార్మోన్ తక్కువ పరిమాణంలో ఉత్పత్తి అయినప్పుడు 'హైపోథైరా యిడిజం' సమస్యల భారిన పడతారు.

డాక్టర్‌ను సంప్రదించటం మేలు: థైరాయిడ్ గ్రంథిలో వాపు లేదా అసౌకర్యంగా ఉన్నట్లు అయితే వైద్యులను సంప్రదించడం చాలా అవసరం. ఒకవేళ రక్త పరీక్షలో బాగున్నప్పటికీ గొంతు ముందు భాగంలో గడ్డ లాగా, లేక వాపు లాగా ఉంటే, నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహా మేరకు వెంటనే గొంతు స్కాన్ చేయించడం వంటివి చేయాలి. అవసరమైతే ఆ వాపుకు (ఎఫ్ఎన్ఎసి) పరీక్ష వంటివి కూడా తప్పక చేయించాలి. కుటుంబంలో గాయిటర్ లాంటి థైరాయిడ్ జబ్బు ఉన్నవాళ్లు అతిగా ఫ్రైడ్, ప్రాసెస్డ్ ఫుడ్స్, సోయా ఉత్పత్తి ఆహారం, క్యాబేజీ తినడం వంటి విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. తీసుకోవాల్సిన జాగ్రత్తలు: ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలి. తగినంతగా అయోడిన్, థైరాయిడ్ హార్మోన్‌ను కలిగి ఉండడం (థైరాయిడ్ హార్మోన్ సరిగ్గా ఉత్పత్తి కావడానికి అయోడిన్ ఎంతో అవసరం. ఆహారంలో అయోడిన్ తగినంత లేకపోతే థైరాయిడ్ హార్మోన్ అనేది అవసరమైనంత విడుదల కాదు, దీంతో థైరాయిడ్ గ్లాండ్ కూడా వాపుకు గురవుతుంది). థైరాయిడ్ స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి ఆహారం ప్రధాన పాత్ర పోషిస్తుంది కావున ప్రొటీన్స్, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే సమతుల్యమైన ఆహారం తీసుకోవాలి. థైరాయిడ్ సమస్య ఉన్న వారు శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి. డాక్టర్ సూచనల మేరకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఒత్తిడి, ఆందోళనలను అదుపులో ఉంచుకోవాలి. వైద్యులు సిఫారసు చేసిన ట్యాబ్లెట్లను ప్రతి రోజూ క్రమం తప్పకుండా వేసుకోవాలి. థైరాయిడ్ టాబ్లెట్ వేసుకున్నాక ఇతర టాబ్లెట్స్ వేసుకోకూడదు. థైరాయిడ్ టాబ్లెట్లకు ఎండ తగలడం వలన కూడా వాటి ప్రభావం తగ్గిపోగలదు. కాబట్టి వాటిని ఎండ తగలని స్థలంలో పెట్టుకోవాలి.

# ఆశాదీపం



రామాపురం అనే చిన్న పల్లెటూరిలో, కష్టపడి పనిచేసే రాముడు అనే రైతు ఉన్నాడు. అతని ఊరికి నీటి సమస్య ఉంది. అక్కడి పంట నేలంతా వర్షాలు సరిగా కురవక, ఎండిపోయి బీటలు వారేది. పొలాలు పచ్చబడక, రైతులు కన్నీరు పెట్టేవారు. రాముడికి శుభోద్ అనే పదేళ్ల కొడుకు ఉన్నాడు. శుభోద్ చిన్నవాడే అయినా, ఊరి కష్టాన్ని అర్థం చేసుకునేంత సున్నితమైన మనసున్నవాడు. వర్షం పడినప్పుడల్లా, ఇంటి పైకప్పుల నుంచి కారిపోయే నీటిని చూసి, 'అయ్యో, ఇంత నీరు వృథాగా పోతోందే!' అని బాధపడేవాడు. ఒక రోజు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. తన పెంకుటింటి పైనుండి నీరు పెద్ద ధారల్లా కిందకు దూకుతోంది. శుభోద్ ఆ ధారను చూస్తూ ఉండగా, మెరుపులాంటి ఆలోచన ఒకటి అతని మదిలో మెరిసింది. వెంటనే తండ్రి దగ్గరికి వెళ్లి 'నాన్నా! మన ఇంటి పైకప్పు మీద పడే వర్షపు నీటిని ఒక గుంట తవ్వి అందులో నిల్వ పెట్టుకుంటే బాగుంటుంది కదా?' అని చెప్పాడు. మరుసటి రోజే, తండ్రీకొడుకులు ఇద్దరూ కలిసి పని మొదలుపెట్టారు. ఇంటి పక్కన పెద్ద గుంట తవ్వారు. నీటిని గుంటలోకి మళ్ళించడానికి కొన్ని పాత పైపులను, పెంకులను ఉపయోగించి ఒక చిన్న కాలువను నిర్మించారు. రాత్రే మళ్ళీ భారీ వర్షం కురిసింది. తెల్లారి ఉదయం లేచి చూస్తే, వారి శ్రమకు తగ్గ ఫలితం కనిపించింది. గుంట వర్షపు నీటితో నిండి, ఉంది. ఈ విషయం క్రమంగా ఊరంతా పాకింది. శుభోద్ ఆలోచనను విని గ్రామస్తులు ఆశ్చర్య పోయారు. ప్రతి ఇంట్లోనూ గుంటలు తవ్వి, వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం మొదలుపెట్టారు. కొద్ది కాలంలోనే రామాపురం నీటి సమస్య నుంచి పూర్తిగా బయటపడింది. ఎండిన పొలాలు పచ్చ బడ్డాయి, రైతుల ముఖాల్లో చిరునవ్వులు వికసిం చాయి. శుభోద్ చిన్న ఆలోచన రామపురం ప్రజల జీవితాలలో కొత్త వెలుగు నింపింది.

# బీమా లాభం అంతంతే..!




ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై ఇప్పటివరకూ ఉన్న 18 శాతం వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను మినహాయిస్తూ జీఎస్టీ పాలక మండలి కీలక నిర్ణయం తీసుకోగా ఇది చారిత్రాత్మకమని కేంద్రంలోని మోదీ సర్కారు ప్రచారం చేసుకొంటున్నది. కానీ, తాజా నిర్ణయంతో బీమా పాలసీలు కొనే కోట్లాదిమందికి దక్కే ప్రయోజనం అంతంతేనని తెలుస్తున్నది. బీమాపై జీఎస్టీని పూర్తిగా తొలగించినప్పటికీ పాలసీదారులకు ఆ స్థాయిలో ప్రయోజనం చేకూరబోదని పరిశ్రమ వర్గాలే చెప్తున్నాయి మరి. ఈ క్రమంలోనే బీమా బేస్ టారిఫ్ రేట్లు 3 నుంచి 5 శాతం పెరగవచ్చని హెచ్చరిస్తున్నారు. దీంతో ఇప్పుడు దీనిపై పెద్ద ఎత్తునే చర్చ జరుగుతున్నది. లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలపై ఇప్పటివరకూ 18 శాతం జీఎస్టీ అమల్లో ఉండేది. దీనిని ప్రస్తుతం పూర్తిగా మినహాయించారు. అంటే జీఎస్టీ సున్నా శాతానికి చేరిందన్నమాట. ఈ నెల 22వ తేదీ నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానున్నది. తాజా నిర్ణయంతో బీమా పాలసీలు చవగ్గా అందుబాటులోకి వస్తాయని.. మరింత మంది సామాన్యులు పాలసీలు తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తారని.. ఇది వారిపై ఆర్థిక భారం తగ్గిస్తుందని కేంద్రంలోని పెద్దలు చెప్తున్నారు. అయితే బీమాపై జీఎస్టీని జీరోకి చేర్చినంత మాత్రాన పూర్తిగా ఈ ప్రయోజనాలు పాలసీదారులకు అందుతాయని చెప్పలేమని బీమా, ఆర్థిక రంగా నిపుణులు చెప్తున్నారు. కంపెనీలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ప్రయోజనాలు అందకపోవడమే దీనికి కారణమని విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం బీమా కంపెనీలు పాలసీలను అమ్మేటప్పుడే కొనుగోలుదారుల నుంచి 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్నాయి. అలాగే ఈ సంస్థలు తాము పెట్టుకున్న కార్యాలయాలకు చెల్లిస్తున్న అద్దెకు, ఏజెంట్లకు ఇస్తున్న కమీషన్లకు, మార్కెటింగ్ తదితర కార్యకలాపాలకుగాను అన్ని దశల్లో ప్రభుత్వానికి జీఎస్టీని చెల్లిస్తూపోతున్నాయి. చివరకు ఈ మొత్తాన్ని పాలసీ అమ్మకాల ద్వారా వచ్చే జీఎస్టీ ఆదాయంలో మినహాయించుకొని మిగిలిన దాన్నే సర్కారుకు చెల్లిస్తున్నాయి. ఈ సర్దుబాటు సౌకర్యమే ఐటీసీ. జీఎస్టీ ఎత్తివేతతో ఐటీసీ క్లెయిములకు ఆస్కారమే లేకుండా పోతున్నది. దీంతో తమ వ్యాపార కార్యకలాపాలకు చేసే చెల్లింపుల భారం ఇకపై కంపెనీలపైనే పడబోతున్నది. అందుకే ఈ భారాన్ని పాలసీదారులపైనే కంపెనీలు వేసే వీలుందని ఇండస్ట్రీ విశ్లేషకులు చెప్తున్నారు. ఇదే జరిగితే పాలసీల బేస్ ప్రీమియం ధరలు 3 నుంచి 5 శాతం పెరగవచ్చని అంటున్నారు. కాబట్టి పాలసీదారులు చెల్లించే మొత్తాలు తగ్గినా.. ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేత పూర్తి ప్రయోజనం మాత్రం అందకపోవచ్చనే పేర్కొంటున్నారు. ఉదాహరణకు.. గతంలో బేస్ ప్రీమియం నెలకు (జీఎస్టీని మినహాయించి) రూ.3,000 అనుకొంటే, ఇప్పుడు తాజా నిర్ణయంతో అది రూ.3,150 వరకూ పెరగొచ్చని అంచనా.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 314 పాయింట్లు పెరగ్గా.. నిఫ్టీ 95పాయింట్లకుపైగా పెరిగాయి. ఐటీ స్టాక్స్ రాణించడంతో పాటు ఈ నెల చివరలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించనుందనే అంచనాల మధ్య ర్యాలీ కొనసాగింది. సెన్సెక్స్ 81వేల పాయింట్ల ఎగువన ముగిసింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,129.69 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,927.97 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,181.37 పాయింట్లకు పెరిగింది.

# రూ.500 రూపాయల పెట్టుబడితో సులువుగా లక్షాధికారి అవ్వచ్చు! ఎలాగంటే..?




ప్రతి ఒక్కరు వారు సంపాదించే ఆదాయంలో కొంత భాగాన్ని సురక్షితంగా ఉండే మంచి రాబడిని పొందే ప్రదేశంలో పెట్టుబడి పెట్టాలని అనుకుంటారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించి పోస్ట్ ఆఫీస్ నిర్వహించే అన్ని పథకాలు బాగా ప్రాచుర్యం పొందాయి. అలాగే భారీ రాబడిని కూడా బాగా ఇస్తున్నాయి కూడా. అలాంటి ఒక పథకం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఇది తక్కువ రిస్క్ పన్ను రహిత పెట్టుబడి రాబడిని కోరుకునే పెట్టుబడిదారుల్లో అత్యంత ప్రజాధరణ పొందింది. ఈ పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ కింద పెట్టుబడిపై 7% కంటే ఎక్కువ వడ్డీని ఇస్తుండగా.. సాధారణ పెట్టుబడి ద్వారా కూడా భారీ నిధిని సేకరిస్తారు. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ కింద ప్రభుత్వం పెట్టుబడిదారులకు 7.1% వార్షిక పన్ను రహిత వడ్డీని అందిస్తుంది. కాబట్టి ఈ ప్రభుత్వ పథకం అధిక పన్ను పరిధిలో ఉన్నవారికి లాభదాయకమైన ఒప్పందంగా ఉంటుంది. ఈ స్కీంలో పెట్టుబడి 80%జ% కింద పన్ను మినహాయింపుతో క్రమశిక్షణతో కూడిన పొదుపులను ప్రోత్సహిస్తుంది. పెట్టుబడిపై అందుకున్న వడ్డీ కూడా పన్ను రహితం. మెచ్యూరిటీ పై పొందిన మొత్తం కూడా పన్ను రహితం. ఈ పథకంలో లాకిన్ వ్యవధి 15 సంవత్సరాలు భారత ప్రభుత్వమే పోస్ట్ ఆఫీస్ పిపిఎఫ్ పథకంలో పెట్టుబడిపై భద్రతకు హామీ ఇస్తుంది. ఇందు కోసం కేవలం రూ. 500 రూపాయల పెట్టుబడితో ప్రారంభించవచ్చు. %ఖాఖీ% పథకంలో ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా రూ.1,50,000 పెట్టుబడి పెట్టవచ్చు. ఈ ప్రభుత్వ పథకం గురించి ప్రత్యేకత ఏమిటంటే.. మీరు 15 సంవత్సరాల లాకిన్ వ్యవధి తర్వాత కూడా పెట్టుబడిని కొనసాగించుకోవాలనుకుంటే దాన్ని ప్రతి ఐదు సంవత్సరాలకు పొడిగించవచ్చు. పెట్టుబడిదారులు ఈ పథకం ద్వారా 15 సంవత్సరాల మెచూరిటీలో 40 లక్షలకు పైగా నిధిని ఎలా సేకరించవచ్చు. మీరు ప్రతి ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా 1.5 లక్షలు దీనిలో పెట్టుబడి పెట్టాము అనుకుందాం. దీని ప్రకారం మీరు మీ ఆదాయం నుండి ప్రతి నెల 12,500 ఆదా చేసుకోవాలి. ఇలా 15 సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా చెల్లిస్తే మీ మొత్తం డిపాజిట్ 22,50,000 అవుతుంది. దీనికి 7.1% వడ్డీ రేటు లభిస్తుంది. ఈ సమయంలో మీరు దీనిపై రూ.18,18,209 హామీతో కూడిన రాబడిని పొందుతారు. అంటే ఈ మెచూరిటీ కాలంలో మీ మొత్తం పెట్టుబడి రూ.40,68,209 అవుతుంది. మీరు మీ సౌకర్యాన్ని బట్టి పెట్టుబడి మొత్తాన్ని పెంచవచ్చు లేదా తగ్గించవచ్చు. పీపీఎఫ్ పథకం కింద ఏదైనా పోస్ట్ ఆఫీస్ లేదా బ్యాంకులో ఖాతాన్ని తెరవచ్చు. ఇది పెట్టుబడిపై రుణ సౌకర్యాన్ని కూడా అందిస్తుంది. ప్రారంభ పెట్టుబడి పెట్టిన ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇది మాత్రమే కాదు.. ఖాతా తెరిచిన ఐదు సంవత్సరాల తర్వాత %ఖాఖీ% ఖాతా నుండి ఉపసంహరణ సౌకర్యాన్ని కూడా పొందవచ్చు.

# కోఆపరేటివ్ రంగం పటిష్ఠం..!

న్యూఢిల్లీ: జీఎస్టీ రేట్ల తగ్గింపుతో దేశవ్యాప్తంగా 10 కోట్లకు పైగా డెయిరీ రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, కోఆపరేటివ్ రంగం బలోపేతం అవుతుందని కేంద్ర సహకార శాఖ వెల్లడించింది. పాల ఉత్పత్తులు, ఆహార ప్రాసెసింగ్ ఉత్పత్తులు, వ్యవసాయ యంత్రాలు, ఎరువులు, బయో%-%పెస్టిసైడ్లు, రవాణా వాహనాలపై పన్ను తగ్గింపుల వల్ల రైతులు, కోఆపరేటివ్ సంస్థలు, గ్రామీణ వ్యాపారాలు నేరుగా లాభపడనున్నాయి. పాల డబ్బాల (ఇనుము, స్టీల్, అల్యూమినియం) పైన కూడా పన్ను తగ్గింపుతో పాల ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి. దీని వలన డెయిరీ రైతులకు ఆదాయం పెరుగుతుందని, గ్రామీణ మహిళా స్వయంసహాయక సంఘాలకు ఇది పెద్ద ఊరట అవుతుందని నిపుణులు తెలిపారు. మొత్తం మీద, ఈ పన్ను తగ్గింపులు కోట్లాది గృహాలకు చౌకైన ఆహార ఉత్పత్తులు అందించడంతోపాటు, రైతుల ఆదాయాన్ని పెంచి, గ్రామీణ వ్యాపారాలు మరింత బలోపేతం కావడానికి దోహదం చేయగలవని పేర్కొన్నారు. 'నెక్స్ట్‌జెన్ జీఎస్టీ సంస్కరణల'ను డెయిరీ కోఆపరేటివ్ రంగం స్వాగతించింది.

అమూల్ వంటి ప్రముఖ కోఆపరేటివ్ బ్రాండ్లు దీనిని రైతు%-%గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుగా అభివర్ణిం చాయి. ఆహార ప్రాసెసింగ్‌కి ఊతం: చీజ్, నమ్‌కీన్‌లు, పాస్తా, జామ్, జెల్లీ, ఫ్రూట్ జ్యూస్ డ్రింక్స్, భుజియా వంటి ఉత్పత్తులపై జీఎస్టీ 5 శాతానికి పరిమితం కానుంది. చాక్లెట్స్, కార్న్‌ఫ్లేక్స్, ఐస్‌క్రీమ్, బిస్కెట్లు, కాఫీ వంటి ఉత్పత్తులపై పన్ను 18% నుంచి 5%కు తగ్గించడం వల్ల ప్రజలపై భారం తగ్గనుంది. దీంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ పెరిగి, ఆహార ప్రాసెసింగ్ రంగం పుంజుకునే అవకాశం ఉంది.

# చేతులు మారిన కంపెనీలు.. వందల కోట్ల డీల్స్



మెడికల్ పరికరాల తయారీ కంపెనీ పాలీ మెడిక్యూర్ ఇటాలియన్ కంపెనీ సిటీఫ్ గ్రూప్‌ను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది.ఇందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. 3.1 కోట్ల యూరోల(రూ. 324 కోట్లు) ఎంటర్‌ప్రైజ్ విలువలో సిటీఫ్‌లో 100 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. తద్వారా సిటీఫ్ ఎస్ఆర్ఎల్‌సహా.. యూఎస్‌ఏ, మెక్సికోలలోని అనుబంధ సంస్థలను సైతం చేజిక్కించుకోనున్నట్లు పేర్కొంది. వెరసి మెడిస్ట్రీమ్ ఎస్ఏ(గ్రూప్)లో 100 శాతం వాటాను కొనుగోలు చేయనున్నట్లు వివరించింది. సిటీఫ్ ప్రధానంగా ఆర్థోపెడిక్ సంబంధిత పరికరాల తయారీలో ప్రత్యేకతను కలిగి ఉన్నట్లు వెల్లడించింది. 25 దేశాలలో ప్రొడక్టులను పంపిణీ చేస్తున్నట్లు తెలియజేసింది. దీంతో ఆర్థోపెడిక్ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు విస్తరించేందుకు వీలు చిక్కనున్నట్లు తెలియజేసింది. హోమ్ అప్లయెన్సెస్ తయారీ దిగ్గజం బజాజ్ ఎలక్ట్రికల్స్.. భారత్ సహా పొరుగు దేశాలలో మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్ మేథో సంపత్తి(ఐపీ) హక్కులను సొంతం చేసుకోనుంది. ఐర్లాండ్ కంపెనీ గ్లెన్ డింప్లెక్స్ గ్రూప్ సంస్థ గ్లెన్ ఎలక్ట్రిక్ నుంచి ఐపీ హక్కులను కొనుగోలు చేయనున్నట్లు బజాజ్ ఎలక్ట్రికల్స్ తాజాగా పేర్కొంది. ఇందుకు రూ. 146 కోట్లు వెచ్చించేందుకు కంపెనీ బోర్డు అనుమతించినట్లు వెల్లడించింది. దీంతో భారత్‌తోపాటు.. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులలో మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్ హక్కులను పొందనున్నట్లు తెలియజేసింది. కాగా.. ఇంతక్రితం 2022 మార్చిలో మర్ఫీ రిచర్డ్స్‌తో ట్రేడ్‌మార్క్ ఒప్పందాన్ని మరో 15ఏళ్లకు పొడిగించింది. 2022 జూలై1 నుంచి అమల్లోకి వచ్చేలా ఒప్పందం కుదిరింది.

# పోస్టాఫీస్‌లో బంఫర్ స్కీమ్.. 12,500తో రూ.40 లక్షలు..




సొంతింటి కలను నిజం చేసుకోవాలనుకునే వారికి, బిడ్డ పెళ్లి చేయాలనుకునే వారికి, కొడుకు ఉన్నత చదువు కోసం డబ్బులు ఆదా చేయాలని చూసే వారికి గుడ్ న్యూస్. ఇక్కడ గుడ్ న్యూస్ అని ఎందుకు అంటున్నాను అంటే కచ్చితంగా ఈ పొదుపు మీ దీర్ఘకాలిక అవసరాలను తీర్చగలదనే భరోసాను ఇవ్వగలదు. ఇందులో పొదుపు చేస్తే మీ డబ్బులకు 100గ్యారంటీ ఉంటుంది. ఎందుకంటే దీనికి కేంద్ర ప్రభుత్వం గ్యారంటీ ఉంది. ఇక్కడ మరోక విశేషం ఏమిటంటే ఈ మొత్తానికి పన్ను మినహాయింపు ఉంటుంది. ఇంతకీ ఈ పథకం ఏంటి, ప్రతి నెల ఎంత పొదుపు చేయాలని అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.. రిస్క్ లేకుండా పెట్టుబడి పెట్టాలనుకునే వారికి, పన్ను ప్రయోజనాలు కోరుకునే వారికి, దీర్ఘకాలిక లక్ష్యాలు ఉన్నవారికి పోస్ట్ ఆఫీస్ పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ దీ బెస్ట్. పీపీఎఫ్ అనేది కేంద్రం సపోర్ట్‌తో నడిచే ఒక పొదుపు పథకం. మీకు తెలుసా ఈ పథకం ప్రస్తుతం 7.9 వార్షిక వడ్డీని అందిస్తుంది. ప్రతి నెలా రూ.12,500 పీపీఎఫ్ ఖాతాలో పెట్టుబడి పెడితే.. ఏడాదికి మొత్తం రూ.1.5 లక్షలు జమ అవుతాయి. ఈ పథకం మెచ్యూరిటీ వ్యవధి 15 ఏళ్లు. మీరు ఈ 15 ఏళ్ల పాటు క్రమం తప్పకుండా పెట్టుబడి పెడితే మెచ్యూరిటీ సమయంలో మీకు దాదాపు రూ.43.60 లక్షలు చేతికి వస్తాయి. ఇందులో రూ.21 లక్షల పైగా వడ్డీ రూపంలోనే వస్తుంది. చిన్న మొత్తాలతో దీర్ఘకాలికంగా ఎక్కువ డబ్బు రావాలనుకునే వారికి పీపీఎఫ్ ఒక అద్భుతమైన ఆప్షన్. డిజిటల్ యుగం కాబట్టి ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లేదా డాక్ పే యాప్ ద్వారా పోస్ట్ ఆఫీసులో పీపీఎఫ్ ఖాతాను ఫోన్‌లో తెరుచుకోవచ్చు. ఇదంతా ఎందుకంటే దగ్గరలోని పోస్ట్ ఆఫీసులో పీపీఎఫ్‌ఖాతాను తెరవాలి. తర్వాత ప్రతి నెల మీ బ్యాంక్ ఖాతా నుంచి పీపీఎఫ్ ఖాతాకు రూ.12,500 ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలి. మెచ్యూరిటీ సమయంలో మీరు పన్నులు ఆదా చేసుకోవడమే కాకుండా మీ ఆర్థిక భవిష్యత్తును సురక్షితం చేసుకోవచ్చు. కేంద్రం హామీ ఇస్తుంది కాబట్టి పీపీఎఫ్‌లో డిపాజిట్ చేసే మొత్తం, వచ్చే వడ్డీ, మెచ్యూరిటీ మొత్తం అన్నీ పూర్తిగా పన్ను రహితం. ఇది ఆదాయపు పన్ను సెక్షన్ 80 జ కింద వర్తిస్తుంది. ఈ పథకం బ్యాంక్ ఫిక్సడ్ డిపాజిట్ల కంటే ఎక్కువ వడ్డీ రేటును అందిస్తుంది. ఇక్కడ మరో వెసులుబాటు ఉంది.. ఒకేసారి లేదా నెలవారీ 12 వాయిదాలలో డబ్బును జమ చేయవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో ఖాతా తెరిచిన 3, 6 ఏళ్ల మధ్య మీ డిపాజిట్‌పై తక్కువ వడ్డీకి రుణం తీసుకోవచ్చు.


# అధిక వడ్డీ ఇచ్చే టాప్ స్కీమ్స్ ఇవే..!



మీరు బ్యాంకులో పెట్టే డబ్బుల కంటే పోస్ట్ ఆఫీస్ స్కీమ్స్ లో ఇంకా అధిక వడ్డీ మీకు వస్తుంది. అవునండి.. నిజమే ప్రభుత్వ బ్యాంకుల దెగ్గర కంటే.. పోస్టు ఆఫీస్ లో మీకు అధిక వడ్డీ లభిస్తుంది. మరి ఆ పోస్టు ఆఫీస్ స్కీమ్స్ ఏంటో ఒకసారి చూసేద్దామా.. ఇందులో మొదటిది టైం డిపాజిట్ స్కీమ్.ఇది మీరు ఎన్ని సంవత్సరాలు ఇన్వెస్ట్మెంట్ చేస్తున్నారనేదాన్నిబట్టి 6.9% నుంచి 7.5%వరకు మీకు ఇందులో వడ్డీ వస్తుంది. ఇందులో ఎవరైనా ఇన్వెస్ట్మెంట్ చేయొచ్చు. మినిమం రూ.1000 రూపాయల ఇన్వెస్ట్మెంట్ చేసినా వడ్డీ సంవత్సరం సంవత్సరం పడుతుంది. ఐదు సంవత్సరాల వరకు ఇన్వెస్ట్మెంట్ చేసే వాళ్ళకి టాక్స్ బెనిఫిట్ సెక్షన్ 80C లో దొరుకుతుంది. పోస్ట్ ఆఫీస్ నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్ లో మీరు డబ్బులు పెడితే ఐదు సంవత్సరాల కానీ మీ డబ్బులు లాక్ ఇన్ లో ఉంటుంది. మీరు తీయలేరు. కానీ వడ్డీ దీనికంటే కొంత ఎక్కువగా 7.7% వస్తుంది. ఆఫీస్ మంత్లీ ఇన్కమ్ స్కీమ్ నెల నెల మీ బ్యాంక్ అకౌంట్ లో డబ్బులు ఈ స్కీమ్ ద్వారా పడుతుంది. మినిమం రూ.1000 రూపాయల ఇన్వెస్ట్మెంట్ గా.. మాక్సిమం సింగిల్ గా అయితే 9 లక్షలు, జాయింట్ గా ఇద్దరు కలిసి అయితే 15 లక్షల వరకు పెట్టొచ్చు. ఆ డబ్బులకు సంబంధించిన వడ్డీ నెల నెల మీ బ్యాంక్ అకౌంట్ లో పడుతుంది. ఇక సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్ ఇందులో వయసైన వాళ్ళు మినిమం 1000 రూపాయల నుంచి మాక్సిమం 30 లక్షల వరకు ఇన్వెస్ట్మెంట్ చేయొచ్చు. ఇందులో 8.2% వడ్డీ లభిస్తుంది. అది ప్రతి మూడు నెలలకి బ్యాంక్ అకౌంట్ లో వేస్తారు. రిటైర్ అయిన వాళ్ళకి రెగ్యులర్ ఇన్కమ్ కోసం బెస్ట్ స్కీమ్.ఇక సుకన్య సమృద్ధి యోజన 10 సంవత్సరాల లోపు మీకు ఆడపిల్లలు ఉంటే ఇది ఖచ్చితంగా వేయాల్సిన స్కీమ్ మినిమం రూ.250 నుంచి మాక్సిమం రూ.1,50,000 వరకు సంవత్సరానికి మనం ఇన్వెస్ట్మెంట్స్ చేస్తే దానిపైన మనకి 8.2% రిటర్న్ లెక్కన వడ్డీ క్యాలిక్యులేట్ అయి లక్షల్లోమీ అమ్మాయి పెద్దయ్యే నాటికి అది ఉపయోగపడుతుంది. ఈ స్కీమ్ ద్వారా వస్తున్న మొత్తం డబ్బులు టాక్స్ ఫ్రీ అండ్ అన్ని స్కీమ్స్ కి కూడా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా భరోసా ఉంటుంది.


## ఆపిల్ యూజర్లకు గుడ్‌న్యూస్..

# నేడే ఫోన్స్ 17 సిరీస్ లాంచ్..!




ఆపిల్ ఐఫోన్స్ ప్రియులకు గుడ్‌న్యూస్. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆపిల్ ఈవెంట్ నేడు జరుగబోతున్నది. కాలిఫోర్నియాలోని స్టీవ్ జాబ్స్ థియేటర్‌లో నేడు 'అవ్ డ్రాపింగ్' పేరుతో ఈవెంట్‌ను నిర్వహించబోతున్నది. స్థానిక కాలమానం ప్రకారం.. మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగనుండగా.. భారత కాలమానం ప్రకారం రాత్రి 10.30 గంటలకు జరుగనున్నది. ఈ ఈవెంట్‌ను ఆపిల్ వెబ్‌సైట్, యూట్యూబ్ ఛానల్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నది. ఈ ఈవెంట్‌లో ఐఫోన్ యూజర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐఫోన్ 17 సిరీస్‌ను ఆవిష్కరించబోతున్నది. అయితే, ఈ సారి డిజైన్‌లో భారీ మార్పులు ఉండనున్నట్లు పలు నివేదికలు వెల్లడించాయి. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొన్నది. ఈవెంట్ ఆపిల్ ఐఫోన్ నాలుగు కొత్త మోడల్స్‌ను లాంచ్ చేయనున్నది. ఇందులో ఐఫోన్ 17, ఐఫోన్ 17 ఎయిర్, ఐఫోన్ 17 ప్రో, ఐఫోన్ 17ప్రో మ్యాక్స్ ఉన్నాయి. ఇందులో ఐఫోన్ 17 ఎయిర్ ప్రత్యేకంగా నిలువనున్నది. 5.5 మిల్లీమీటర్ల మందంతో ఐఫోన్స్‌లో ఇదే అత్యంత సన్నపాటి ఫోన్‌గా నిలువనున్నది. 6.6 అంగుళాల డిస్‌ప్లే, ప్రో మోషన్ టెక్నాలజీ, శక్తివంతమైన ఏ19 ప్రాసెసర్‌తో పాటు ఆపిల్ సొంతంగా తయారుచేసిన వై-ఫై చిప్‌పై పని చేయనున్నది. అయితే, ఇందులో ఫిజికల్ సిమ్ స్లాట్ మాత్రం ఉండదు. కేవలం ఈ-సిమ్ మాత్రమే పని చేయనుందని టాక్. ఈ ఫోన్ ధర సుమారు 900 డాలర్లుగా ఉండవచ్చని పలు నివేదికలు తెలిపాయి. ఇక ఐఫోన్ 17 బేస్ మోడల్‌లో సరికొత్తగా 120 ఎఓ ప్రో మోషన్ టెక్నాలజీతో ఏ19 ప్రాసెసర్‌తో పాటు 48మెగా పిక్సల్ మెయిన్ కెమెరాతో వస్తుంది. ఈ మోడల్ కనీస ధర 800 డాలర్లు అంటే భారతీయ కరెన్సీలో రూ.70వేలకుపైగా ఉండొచ్చని సమాచారం. ఇదిలా ఉండగా.. ఈ సారి ప్రో మోడల్స్‌ను పూర్తిగా మార్చేసినట్లు సమాచారం. రియర్‌లో సెటప్‌ను అడ్డంగా మార్చేనట్టుగా తెలుస్తున్నది. టైటానియం బాడీకి బదులుగా అల్యూమినియం బాడీతో రానున్నట్లు సమాచారం. ఐ19 ప్రో ప్రాసెసర్, 48 వీూ టెలిఫొటో లెన్స్‌తో పాటు ఫ్రంట్, రియర్‌లో ఒకేసారి వీడియో రికార్డ్ చేసే వీలు కూడా కల్పించనున్నట్లు తెలుస్తున్నది. ప్రో మోడల్‌లో 6.3 అంగుళాలు, ప్రో మ్యాక్స్6.9 అంగుళాల డిస్‌ప్లేతో రానున్నది. ఆయా మోడల్స్ ధరలు వెయ్యి డాలర్లకుపైగా ఉండనున్నట్లు తెలుస్తున్నది. అలాగే, ఐఫోన్ 17 సిరీస్‌తో పాటు ఆపిల్ ఎయిర్‌పాడ్ ప్రో3, ఆపిల్ వాచ్ అల్ట్రా 3 సిరీస్‌తో పాటు ఆపిల్ వాచ్ ఎస్ఈ మోడల్‌ను ఆవిష్కరించనున్నది.

# 10 ఏళ్లలో భారీగా పెరిగిన రాష్ట్రాల అప్పులు..




భారత్ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ. ఇటీవల, జపాన్‌ను అధిగమించి ప్రపంచవ్యాప్తంగా నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. రాబోయే 2.5 నుంచి 3 సంవత్సరాలలో జర్మనీని అధిగమించే అవకాశం ఉందని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఇటీవల అంచనా వేశారు. కానీ.. అప్పులు కుప్పలు సైతం అంతే వేగంగా పెరుగుతున్నాయి. భారతదేశంలోని 28 రాష్ట్రాల ఉమ్మడి అప్పు గత దశాబ్దంలో మూడు రెట్లు పెరిగిందని తాజాగా కాగ్ రిపోర్టులో వెల్లడైంది. 2013%-%14లో ?17.57 లక్షల కోట్ల నుంచి 2022%-%23 నాటికి ?59.60 లక్షల కోట్లకు పెరిగిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్తాజా నివేదిక తెలిపింది.

# పవన్, చిరు కాంబోలో మూవీ



## రామ్‌గోపాల్ వర్మ ఆసక్తికర పోస్ట్


దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన తాజా పోస్ట్‌తో మెగా అభిమానులను ఆకర్షించారు. చిరంజీవి నటించిన తొలి చిత్రం 'ప్రాణం ఖరీదు'విడుదలై 47ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు పవన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆ పోస్ట్‌ను రీషేర్ చేసిన రామ్‌గోపాల్ వర్మ.. చిరు, పవన్ కలిసి సినిమా తీయాలని కోరారు. మీరిద్దరూ కలిసి ఒక సినిమా చేస్తే అది ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకులందరికీ మెగా పవర్ జోష్ నింపినట్లు అవుతుంది. ఆ చిత్రం ఈ శతాబ్దంలోనే మెగా పవర్ సినిమా అవుతుందని రామ్‌గోపాల్ వర్మ పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. ఒకవేళ ఇదే జరిగితే ఈ సినిమాకు ఎవరు దర్శకత్వం వహిస్తే బాగుంటుందని నెటిజన్లు వారి అభిప్రాయాలను కామెంట్స్ చేస్తున్నారు. ఇక చిరు నటించిన తొలి సినిమా విడుదలై 47 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అన్నయ్యపై పవన్ కల్యాణ్ అభిమానం చాటారు. నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. చిరంజీవి పుట్టకతోనే యోధుడని పేర్కొన్నారు. ఆయనకు రి-టైర్మెంట్ ఉండదని ప్రశంసలు కురిపించారు. పవన్ పోస్ట్‌కు స్పందించిన చిరు.. ఆ మాటలు తనను పాత రోజులకు తీసుకెళ్లాయని తెలిపారు.

# హద్దులు చెరిపేస్తున్న తమన్నా...



మిల్కీ బ్యూటీగా దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ నటి తమన్నా భాటియా, ఇప్పుడు తన కెరీర్‌లో అత్యంత సాహసోపేతమైన అడుగు వేయబోతున్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్‌లో హారర్ మరియు బోల్డ్ కంటెంట్‌తో సంచలనం సృష్టించిన 'రాగిణి MMS ఫ్రాంచైజీలో ఆమె నటించబోతోందన్న వార్త ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సిరీస్‌లో మూడవ భాగంగా రాబోతున్న చిత్రంలో తమన్నానే కథానాయిక అని గట్టిగా ప్రచారం జరుగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ప్రాజెక్ట్ కోసం నిర్మాత ఏక్తా కపూర్ స్వయంగా తమన్నాతో చర్చలు జరిపారు. ఈ ప్రతిపాదనకు తమన్నా కూడా సానుకూలంగా స్పందించినట్లు, ఇరు వర్గాల మధ్య ఒప్పందం దాదాపు ఖరారైనట్లు బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. ఈ పాత్ర కోసం తన కంఫర్ట్ జోన్‌ను దాటి, కొన్ని బోల్డ్ సన్నివేశాల్లో నటించేందుకు కూడా ఆమె సిద్ధపడినట్లు సమాచారం. గత కొంతకాలంగా తమన్నా తన కెరీర్ గ్రాఫ్‌ను పూర్తిగా మార్చే ప్రయత్నంలో ఉన్నారు. 'జైలర్' చిత్రంలో ప్రత్యేక గీతంతో మాస్‌ను ఉర్రూతలూగించిన ఆమె, 'లస్ట్ స్టోరీస్ 2' వెబ్ సిరీస్‌లో బోల్డ్ పాత్రలో నటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సీనియర్ హీరోయిన్లు క్లాసిక్ పాత్రలకే పరిమితమవుతుంటే, తమన్నా మాత్రం గ్లామర్ మరియు నటనకు ఆస్కారమున్న విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. 'రాగిణి MMS 2' చిత్రంలో సన్నీ లియోన్ నటన, 'బేబీ డాల్' పాట సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. ఇప్పుడు అదే ఫ్రాంచైజీలో తమన్నా అడుగుపెట్టనుండటంతో అంచనాలు భారీగా పెరిగాయి. సన్నీ లియోన్ నెలకొల్పిన బెంచ్‌మార్క్‌ను తమన్నా అందుకుంటుందా? లేక తనదైన శైలిలో ఆమెను మించిపోతుందా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ వార్త నిజమైతే, తమన్నా కెరీర్‌లో ఇది ఒక సంచలన చిత్రంగా నిలిచిపోవడం మాత్రం ఖాయం.


# హీరోయిన్ కాకుంటే రాశీ ఖన్నా ఏమయ్యేదో తెలుసా..!



ప్రస్తుతం టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలుగుతు న్నరాశీ ఖన్నాకి సంబంధించిన ఆసక్తికర విషయం నెట్టింట వైరల్ అవుతుంది. నటన అనేది తన గోల్ కాదని, ఐఏఎస్ ఆఫీసర్ కావాలని ఎన్నో కలలు కన్నానని చెప్పుకొచ్చింది. చదువులో ఎప్పుడూ ముందు వరుసలో నిలిచిన ఈ ఢిల్లీ అమ్మాయి, జీవితంలో టర్నింగ్ పాయిం ట్స్ గురించి ఊహించలేదు. 1990 నవంబర్ 30న ఢిల్లీలో జన్మించిన రాశి ఖన్నా, చిన్నప్పటి నుంచే పాఠశాలలో టాపర్‌గా నిలిచేది. ఢిల్లీ యూనివర్సిటీలో ఇంగ్లీష్ లిటరేచర్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసింది. డిగ్రీ చదువుతున్న సమయంలోనే కొంతకాలం అడ్వర్టైజ్మెంట్ ఏజెన్సీ కోసంకాపీ రైటింగ్ కూడా చేసింది. అదే సమయంలో ఐఏఎస్ కావా లన్న స్వప్నాన్ని గుండెల్లో పెట్టుకుని ముందుకు సాగింది. కానీ జీవితం లో ఊహించని మలుపులతో నటన వైపు వచ్చేసింది. డిగ్రీ చదువుతున్న సమయంలోనే మోడలింగ్ అవకాశాలు వచ్చిన రాశి, తక్కువ సమయంలోనే వెండితెరపై అడుగుపెట్టింది. 2013లో సుజిత్ సర్కార్ దర్శకత్వంలో వచ్చిన 'మద్రాస్ కేఫ్' ద్వారా బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఇందులో జాన్ అబ్రహం భార్యగా నటించిన ఈమెను ప్రేక్షకులు గుర్తుపెట్టుకు న్నారు. 2014లో నాగశౌర్యతో కలిసి నటించిన 'ఊహలు గుసగుస లాడే' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది రాశి ఖన్నా. ఆ తర్వాత 'మనమ్','తొలిప్రేమ', 'వెంకీమామ', 'ప్రతిరోజూ పండగే', 'సర్దార్', 'థాంక్యూ' వంటి చిత్రాల్లో నటించి క్లాస్ అండ్ మాస్ ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఐఏఎస్ ఆఫీసర్ అవ్వాలన్న కలను పక్కన పెట్టి, ఇప్పుడు ఒక్కో చిత్రానికి కోటికి పైగా పారితోషికం తీసుకుంటున్న రాశి ఖన్నా, ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో కలిసి 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో నటిస్తోంది. ఇటీవల పవన్ బర్త్‌డే సందర్భంగా షూటింగ్ సెట్స్‌లో నుంచి ఒక ఫోటో లీక్‌చేసి ఫ్యాన్స్‌కి మంచి కిక్ ఇచ్చింది. మొత్తానికి రాశీ ఖన్నా డ్రీమ్ గోల్ చాలా పెద్దదే అని తెలు సుకొని ఫ్యాన్స్ అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.


# ఎన్నో రహస్యాలతో నియమాలను తిరగ రాయడానికి 'దక్ష' వస్తోంది..

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ చిత్ర శుక్ల 'దక్ష' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మెడికల్ అండ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమాలో మంచు లక్ష్మీ ప్రసన్న, సిద్ధిఖీ, కలెక్షన్ కింగ్, పద్మశ్రీ అవార్డు గ్రహిత మోహన్ బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. డైమండ్ రత్నబాబు అందించిన కథతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వంశీ కృష్ణ మల్లా దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విశ్వంత్, మహేష్, విరేన్, తంబి దొరై, సముద్రఖని, కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని మంచు ఎంటర్టైన్మెంట్స్, శ్రీ లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ సంయుక్తం గా నిర్మిస్తున్నాయి. అచ్చు రాజమణి సంగీతం అందిస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబర్ 12న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ విషయాన్ని తెలుపుతూ మూవీ మేకర్స్ హీరోయిన్ చిత్ర శుక్ల పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను షేర్ చేశారు. ఇందులో ఆమె 'మిథిలా' పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించారు. ఇక ఈ విషయాన్ని తెలుపుతూ చిత్ర ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. "మిథిలా ముఖం అమాయకంగా కనిపిస్తుంది. కానీ మీరు తెలుసు అనుకున్న.. ప్రతి దాన్ని బద్దలు కొట్టే రహస్యాలతో ఆమె పాత్ర ఉండబోతుంది. ప్రపంచంలో సున్నితమైన స్వరంతో ఉంటుంది. కానీఆమెసైలెన్స్‌ను బలహీనతగా పొరపాటు పడకండి.



# సినిమా..

## శ్రీదేవి చివరి కోరిక ఏంటి.. అది కుటుంబ సభ్యులు తీర్చారా..!



అతిలోక సుందరి శ్రీదేవి గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. తొలుత బాలనటిగా సినిమా రంగంలో అడుగుపెట్టిన శ్రీదేవి, అనంతరం తన అందం, అభినయం, నటనతో భారతీయ సినిమా లోకాన్ని శాసించింది. 300కు పైగా సినిమాల్లో నటించి, "అతిలోక సుందరి"గా అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకుంది. తెలుగు, తమిళ, మళయాళం, హిందీ వంటి భాషల్లో విస్తృతంగా నటించి, కోట్లాది మంది అభిమానుల మనసులు గెలుచుకుంది. అయితే, సినీ ప్రపంచాన్ని తీరని విషాదంలో ముంచెత్తుతూ, 2018 ఫిబ్రవరిలో శ్రీదేవి ఆకస్మికంగా మరణించింది. తన మేనల్లుడి వివాహ కార్యక్రమానికి హాజరవడానికి దుబాయ్ వెళ్లిన సమయంలో, అక్కడి ఓ హొటల్ గదిలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందింది. ఈ ఘటనతో సినీ పరిశ్రమతో పాటు దేశవ్యాప్తంగా ఆమె అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. అయితే శ్రీదేవి జీవితాంతం తెలుపు రంగును ఎంతో అభిమానించింది. ఆమె నటించిన అనేక సినిమాల్లో, పాటలలోనూ తెలుపు రంగు దుస్తులు కనిపించడం చూస్తే, ఆమెకు ఆ రంగు మీద ఉన్న ప్రేమ స్పష్టమవుతుంది.

ఈ నేపథ్యానుగుణంగానే, శ్రీదేవి తన ఆఖరి కోరికగా "తన అంత్యక్రియలు తెలుపు రంగుతో జరగాలి" అని పలు ఇంటర్వ్యూల్లో చెప్పింది. ఆమె కుటుంబ సభ్యులు ఈ కోరికను తీరుస్తూ, అంత్యక్రియలన్నీ తెలుపు రంగు పూలతో నిర్వహించారు. ఆమె మృతదేహాన్ని ఉంచిన స్థలాన్ని తెల్ల మల్లెలు, తెల్ల గులాబీలతో అలంకరించారు. అంతిమయాత్రకు తీసుకెళ్లిన వాహనాన్ని కూడా తెలుపు పువ్వులతో అలంకరించారు. ఈ విధంగా, ఎంతో దుఃఖంలోనూ శ్రీదేవి ఆఖరి కోరికను నెరవేర్చిన ఆమె కుటుంబం, ఆమెకి తగిన గౌరవాన్ని అందించింది. శ్రీదేవి ఈరోజు మన మధ్య లేకపోయినా, ఆమె సినిమాలు, నటన, ఆమె అందం తెలుగు సహా భారతీయ సినీ ప్రపంచంలో ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయి.

# 'మాస్ జాతర' చిత్రం వాయిదా



కాస్త ఆలస్యమైనా అసలుసిసలైన మాస్ పండుగను థియేటర్లలో తీసుకొస్తామని నిర్మాతలు హామీ ఇచ్చారు. మాస్ మహారాజా రవితేజ అభిమానులతోపాటు, సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మాస్ జాతర' చిత్రం ఆగస్టు 27వ తేదీన థియేటర్లలో విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఇటీవల పరిశ్రమ వ్యాప్తంగా జరిగిన సమ్మెలు, కీలకమైన కంటెంట్‌ను పూర్తి చేయడంలో ఊహించని జాప్యం కారణంగా.. సినిమాను అనుకున్న తేదీకి సకాలంలో సిద్ధం చేయలేకపోయామని నిర్మాతలు అధికారికంగా తెలిపారు.

కంగారుగా సినిమాని విడుదల చేయడం కంటే.. కాస్త సమయం తీసుకొని అత్యుత్తమ చిత్రంగా మలిచి, ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్మాతలు స్పష్టం చేశారు. మాస్ జాతార చిత్రాన్ని అసలైన పండుగ సినిమా గా తీర్చిదిద్దడానికి ప్రతి విభాగం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని, ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతు న్నాయని నిర్మాతలు తెలిపారు. కొత్త విడుదల తేదీ ఇంకా ఖరారు కానప్పటికీ, త్వరలోనే ప్రకటన వస్తుందని పేర్కొన్నారు. అభిమానులు నిరీక్షణకు బహుమానంగా త్వరలో ఆశ్చర్యకర కంటెంట్ రాబోతుందని నిర్మాతలు హామీ ఇచ్చారు.

# మళ్లీ సినిమాలు చేస్తానంటున్న ఇలియానా..



గోవా బ్యూటీ ఇలియానా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దేవదాసు సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి ఆ తర్వాత రాఖీ, పోకిరి, జల్సా వంటి సూపర్‌హిట్‌లను అందుకోవడమే కాకుండా స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది.

ఒకప్పుడు స్టార్ నటిగా రూల్ చేసిన ఈ భామ ప్రస్తుతం సినిమాలు మానేసి ఫ్యామిలీతో సమయం గడుపుతున్న విషయం తెలిసిందే. 2023లో మైఖేల్ డోలన్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్న ఇలియానా ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చింది. అయితే గత కొన్ని రోజులుగా ఫ్యామిలీతోనే గడుపుతున్న ఈ భామ.. తాజాగా మళ్లీ సినిమాలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ ప్రస్తుతం తాను తన ఇద్దరు కొడుకుల సంరక్షణలో బిజీగా ఉన్నానని, అందుకే సినిమాలకు విరామం తీసుకున్నానని ఇలియానా చెప్పింది. అలాగే అభిమానులు నన్ను ఎంతగా మిస్ అవుతున్నారో నాకు తెలుసు. నటన అంటే నాకెంతో ఇష్టం. తెరపై కనిపించడం, విభిన్నమైన పాత్రలు పోషించడం, సెట్‌లో ఉండే సందడి ఇవన్నీ నాకు చాలా ఇష్టం. నా కెరీర్‌లో ఎంతోమంది గొప్ప వారితో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం అని ఇలియానా అన్నారు.

అయితే పిల్లల బాధ్యతకు తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని, అందుకే కొద్ది రోజులు ఆగి మళ్లీ వస్తానని ఆమె తెలిపారు. తిరిగి వచ్చే ముందు మానసికంగా, శారీరకంగా సిద్ధం కావడానికి కొంత సమయం పడుతుంది. ఏ పని చేసినా దానికి పూర్తిగా న్యాయం చేయాలనుకుంటాను అని ఆమె ఇలియానా తెలిపారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215